ముసురు.. ముంపు



కొల్లూరు : మొసలిపాడు వద్ద నేలవాలిన వరిపైరు

అల్పపీడనం.. రైతులను ముంచేస్తోంది. పైరు నీటి పాలైంది. ఈదురుగాలులకు నేలవాలింది. కోతలకు సిద్ధమైన వరి చేతికి అందదేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడి ఓ మోస్తరు నుంచి భారీగా వర్షాలు పడుతున్నాయి. మంగళ వారం అర్ధ రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు ముసురు పట్టినట్లు వర్షం పడింది. కొన్ని ప్రాంతాల్లో వర్షం పంటలకు మేలు చేయగా కంకి దశలో ఉన్న వరి, తీత దశలో ఉన్న పత్తి తదితర పంటలకు నష్టం చేసింది. కృష్ణా తీరంలోని లంక గ్రామాల్లో వాణిజ్య పంటలకు వర్షం మేలు చేసింది. వరదలకు పంట దెబ్బ తిన్న చేలల్లో మినుము విత్తిన రైతులకు మాత్రం మళ్లీ నష్టం తప్పదని చెబుతున్నారు. పలు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో కాలనీలు జలమయంగా మారడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


- అల్పపీడనంతో వీడని వర్షాలు
- పంటలు వర్షార్పణం.. రైతుల ఆందోళన
- కంకి దశలో వరి.. దిగుబడులపై తీవ్ర ప్రభావం

తెనాలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో బుధవారం భారీ వర్షాలు పడ్డాయి. ఎన్నో వ్యయ ప్రయాసలతో సాగు చేసిన వరి చేతికొచ్చే సమయంలో వర్షాలకు నేలవాలిపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న పైరు నేలవాలి వర్షపు నీటిలో నానుతుంది. కృష్ణా పశ్చిమ డెల్టాలో ఖరీఫ్ సాగు 5.73 లక్షల ఎకరాల్లో వరి వేయగా ఈ వర్షాలు రైతులను దెబ్బతీస్తున్నాయి. గుంటూరు జిల్లాలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, బాపట్ల జిల్లాలోని కొల్లూరు, వేమూరు, అమృతలూరు, చుండూరు, భట్టిప్రోలు, రేపల్లె తదితర మండలాల్లో ఇప్పటికే వరి కంకులు వచ్చి, గింజ పాలుపోసుకునే దశలో ఉంది. కంకులు రాని పంటకు వర్షం మేలు చేస్తే, కంకి వేసిన పంటకు మాత్రం నష్టం తప్పడంలేదని రైతులు చెబుతున్నారు. గింజ పాలుపోసుకునే దశలో వర్షం ఎక్కువగా ఉంటే, గింజ తాలుగా మారి దిగుబడి తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు. గింజ పాలుపోసుకున్న చేలల్లో మాత్రం ముసురు కారణంగా మానుకాయ వల్ల కూడా నష్టం తప్పడంలేదంటున్నారు. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో వరి పంట నేలవాలింది. కంకులు బరువు లేకున్నా కొన్ని చేలు చాపలా పరుచుకున్నాయి. దీంతో రైతులకు పంటను పైకి నిలబెట్టుకోవడం తలకుమించిన పని అవుతోంది. అరటి, బొప్పాయి, కంద, పసుపు పంటలు గత వరదలకు దెబ్బతనగా, మిగిలిన వాటికి వర్షం మేలు చేసిందని రైతులు చెబుతున్నారు. వరదల తర్వాత మళ్లీ మినుము చల్లిన రైతులకు ఈ వర్షం నిరాశ మిగిల్చింది. మరో సారి ఆ రైతులకు నష్టం తప్పడంలేదు. మొక్క ఇప్పుడిప్పుడే బయటకు వస్తుంటే, వర్షం ముంచేయడంతో అదికాస్తా దెబ్బతినపోతుందని, మరోసారి విత్తాల్సిందేనని రైతులు ఆవేదన చెందుతున్నారు. గుంటూరు జిల్లాలోని తెనాలి, పొన్నూరు, మంగళగిరి వంటి పట్టణాల్లో రోడ్లు, కాలనీలు జలమయమయ్యాయి. అటు బాపట్ల జిల్లాలోని

(మిగతా 8వ పేజీలో)

హోంమంత్రి అనిత కలెక్టర్లతో సమీక్ష

భారీవర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని హోంమంత్రి వంగలపూడి అనిత కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్లతో అమరావతి రాజధాని నుంచి మంత్రి వీక్షణ సమావేశం నిర్వహించారు. బాపట్ల నుంచి కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ హాజరయ్యారు.



నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబరు హెచ్చరిక

రేపల్లె: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. బుధవారం నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగురవేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు. సముద్రంలో వేట చేసే మత్స్యకారులంతా తక్షణమే ఒడ్డుకు చేరాలని వాకీటాకీల ద్వారా సమాచారం అందించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉందని మత్స్యకారులు బోట్లు వేసుకుని తిరుగు ప్రయాణమై హార్బర్‌కు చేరారు.

ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్!



గత 14 రోజులుగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిచిపోయాయి. పేద రోగులు అత్యవసర పరిస్థితుల్లో సొమ్ము చెల్లించి వైద్యం చేయించుకోవాల్సిన దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ వైద్యశాలల మధ్య బిల్లుల బకాయి రగడ నడుస్తోంది. బకాయి చెల్లింపుల అంశంలో పలుమార్లు ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఆస్పత్రుల నిర్వాహకులు ఉచిత వైద్య సేవలను నిలిపివేశారు. బకాయి విడుదల కోరుతూ ఆందోళన బాట పట్టారు. గురువారం చలో విజయవాడకు నెట్‌వర్క్ ఆస్పత్రుల యూనియన్ పిలుపు నిచ్చింది. పల్నాడు జిల్లాలో 111, గుంటూరు జిల్లాలో 128, బాపట్ల జిల్లాలో 60 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉచిత వైద్య సేవలను నిలిపివేసినట్లు యూనియన్ నేతలు తెలిపారు.

ఉచిత వైద్యసేవలను నిలిపివేసిన నెట్‌వర్క్ ఆస్పత్రులు

- వైద్యం అందక పేద రోగుల ఇక్కట్లు
- బిల్లుల విడుదల కోసం వైద్యుల ఆందోళన బాట
- నేడు చలో విజయవాడ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులను కొంత మేర చెల్లించింది. అయితే పాత బకాయిలతో పాటు కొత్త బకాయిలు పేరుకుపోయాయి. దీంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలను నిలిపివేసి బకాయి (మిగతా 8వ పేజీలో)



నరసరావుపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న నెట్ వర్క్ ఆస్పత్రుల వైద్యులు, వైద్య సిబ్బంది

పిడుగుపాటుకు కూలిన జీవితాలు

- ఇద్దరు మహిళా కూలీల మృతి..
- మరో మహిళకు తీవ్ర గాయాలు



కమలమ్మ




ముజాహిదా

పొన్నూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు వరి పొలంలో కలుపు తీస్తున్న ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందారు. దీంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పొన్నూరు పట్టణానికి చెందిన మహిళా కూలీలు బుధవారం పట్టణ శివారులో ఉన్న బాడవ డొంకలోని వరి పొలాల్లో కలుపు తీయడానికి వెళ్లారు. ఎడతెరిపి లేని వర్షం కురుస్తుండటంతో కూలీలు పంట పొలం నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో ఒక్కసారిగా కాలువ దాటుతున్న వలపర్ల కమలమ్మ (45) అలియాస్ మరియమ్మ, షేక్ ముజాహిదా (50) పిడుగుపాటుకు గురయ్యారు. పక్కనే ఉన్న పంట కాల్వలో విగత జీవులై పడ్డారు. వారి సమీపంలో ఉన్న మరో మహిళ మేళం మాణిక్యమ్మ గాయాలు కావడంతో.. స్పృహ తప్పి పడిపోయింది. ఆమెను 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తోటి కూలీలు, మృతుల కుటుంబ సభ్యులు ఘటనా స్థలంలో విగత జీవులుగా ఉన్న వారిని చూసి కంటతడి పెట్టుకున్నారు. అర్బన్ సీఐ ఎల్.వీరా నాయక్, తహసీల్దారు జియావుల్ హక్ ఘటనా స్థలానికి చేరుకొని.. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సార్.. అభివృద్ధికి సహకరించండి

- సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే ఏలూరి భేటీ
- మిగిలిన పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని వినతి

పర్చూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని సమస్యలు, మౌలిక వసతులు, అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ్ని ప్రత్యేకంగా కలిశారు. వర్షాలు, తుఫాన్ల సమయంలో వరద ముంపు నివారణకు నియోజకవర్గంలో 40 కిలోమీటర్ల డ్రెయినేజీ వ్యవస్థను ఆధునికీకరిస్తే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రైతుల వద్ద మిగిలి ఉన్న నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎంకు వినతిపత్రం అందజేశారు.



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఎమ్మెల్యే ప్రతిపాదనలు..

- చీరాల నుంచి మోటుపల్లి వరకు రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు.
- మార్టూరు మండలంలోని కోలలపూడి, వలపర్ల, బొల్లాపల్లి గ్రామాలు, చిన్నగంజాం మండలంలోని కడవకుదురు, రాజుబంగారుపాలెం, ఇంకొల్లు మండలంలోని కొణికి గ్రామాల్లో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించాలి.
- పర్చూరు నియోజకవర్గ పరిధిలో బకింగ్‌హామ్ కాల్వను అంతర్గత జల మార్గంగా అభివృద్ధి చేయాలి.
- మార్టూరు మండల కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి.
- పర్చూరు నియోజకవర్గంలో దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని సుమారు 5వేల ఎకరాల ఇనాం, ఎస్టేట్ భూముల సమస్యను పరిష్కరించాలి.
- గుంటూరు చానల్ పొడిగింపునకు 51 ఎకరాల భూసేకరణ నిధులు మంజూరు చేయాలి.



ప్రకాశం జిల్లాలోకి అద్దంకి?

- కలెక్టర్‌ను నివేదిక కోరిన సీసీఎల్ఏ

అద్దంకి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలుకు సమీపంలోని అద్దంకి ప్రాంతవాసుల కల నెరవేరనున్నదా.. అంటే ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అవునంటున్నాయి. అద్దంకిని ప్రకాశం జిల్లా పరిధిలోకి మార్చాలని ఆ ప్రాంతవాసుల డిమాండ్‌పై ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు రెండు రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి ఆదేశించారు. వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా జిల్లాల విభజన చేసిన క్రమంలో అద్దంకి నియోజకవర్గం ఒంగోలుకు సమీపంలో ఉన్నా దూరంగా ఉన్న బాపట్ల జిల్లా పరిధిలో చేర్చారు. దీనిపై అప్పట్లోనే అద్దంకివాసులు అనేకసార్లు ఆందోళనలు చేసినా ఎలాంటి స్పందన లేదు. ఎన్నికల సమయంలో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు నాయుడు, యువగళం పాదయాత్రలో లోకేశ్ అద్దంకివాసుల డిమాండ్‌ను చేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వంలో అద్దంకి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో అద్దంకిని ప్రకాశం జిల్లాలోకి చేర్చే విషయంపై ప్రత్యేక దృష్టి సారించి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. జిల్లాల పునర్విభజన కమిటీ దృష్టికి కూడా మంత్రి రవికుమార్ అద్దంకి విషయాన్ని తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో బుధవారం అమరావతి నుంచి సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, కార్యదర్శి వెంకటమురళి నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపే విషయమై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని బాపట్ల కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సూచించారు. అద్దంకి ప్రాంత సరిహద్దులు నిర్ణయిస్తూ నివేదిక నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఉన్నతస్థాయి అధికారులు దృష్టి పెట్టిన నేపథ్యంలో త్వరలోనే అద్దంకివాసుల కల నెరవేరుతుందని సమాచారం. అదే సమయంలో అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మంత్రి రవికుమార్ కృషి చేస్తున్నట్లు తెలుస్తుంది.

పత్తి కొనుగోలు ఉత్తిదేనా?!

- సీసీఐ కేంద్రాల ఏర్పాటుపై లేని స్పష్టత
- మొదలైన పత్తి దిగుబడులు
- నిబంధనల మెలికతో రైతుల ప్రయోజనాలకు గండి!
- జిల్లా ఆవిర్భావం నుంచి అదే తీరు



ప్రతి ఏడాదీ పత్తిసాగు

జిల్లాలోని పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధిలోని పది మండలాల్లో ప్రతి ఏడాది పత్తి సాగు జరుగుతూనే ఉంటుంది. బాపట్ల జిల్లాగా ఆవిర్భావం జరిగిన తొలి రెండేళ్లు సీసీఐ కొనుగోలు కేంద్రాల జాడే కరువైంది. గతేడాది మాత్రం ఆలస్యంగా సీసీఐ కేంద్రాలను తెరిచినా.. అప్పటికే పెద్ద ఎత్తున పత్తి దళారుల వద్దకు చేరింది. ప్రస్తుతం ఆ గణాంకాలను సాకుగా చూపి, సాగు విస్తీర్ణం వంటి నిబంధనలతో మళ్లీ మొండి చెయ్యి చాచడానికి అధికారులు ప్రయత్నాన్ని రైతులు తప్పుబడుతున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పంట దిగుబడులకు మద్దతు ధర లభించడం ఏటికేడు ఎండమావిగా మిగులుతున్న తరుణంలో.. ప్రభుత్వాలు నిర్దేశించిన గిట్టుబాటు ధర ఫలాలు అన్నదాతలకు అందడం లేదు. బాపట్ల జిల్లా ఆవిర్భవించి ఇప్పటికీ మూడేళ్లు గడిచినా.. పత్తి కొనుగోలు చేసే సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సేవలు.. ఇక్కడి రైతుల దరికి అంతంత మాత్రంగానే చేరుతున్నాయి. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో క్వింటా పత్తిని కూడా కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు సేకరించిన పాపాన పోలేదు. గడచిన ఆర్థిక సంవత్సరంలో మాత్రం 13 వేల క్వింటాళ్ల పత్తిని మద్దతు ధరకు సీసీఐ కొనుగోలు చేసింది. ఈ ఏడాది పత్తి దిగుబడులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. కానీ సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరవడంపై స్పష్టత రాలేదు. పర్చూరు నియోజకవర్గం పరిధిలో రెండు కొనుగోలు కేంద్రాలను తెరుస్తున్నట్లు మార్కెటింగ్‌శాఖ ప్రకటించి

(మిగతా 8వ పేజీలో)

అద్దంకిలో డయాలసిస్ సెంటర్

- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

అద్దంకి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం కింద అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.75 లక్షల విలువైన 3 రక్త శుద్ధి యంత్రాలు, పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. మూడు షిఫ్ట్‌ల్లో రోజుకు 15 మందికి రక్త శుద్ధి చేసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధిపై దృష్టి సారించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేశారు. ఈ కేంద్రంతో అద్దంకితో పాటు దర్శి నియోజకర్గంలోని రోగులు డయాలసిస్ కోసం ఒంగోలు, గుంటూరు ప్రాంతాలకు వెళ్ళే వ్యయ ప్రయాసలు తగ్గనున్నాయి. భవన వసతిపై ఇప్పటికి మంత్రి సూచనలతో అధికారులు పరిశీలన కూడా చేశారు. ప్రస్తుతం సీహెచ్‌సీ భవనంలోని కొన్ని గదులను డయాలసిస్ సెంటర్‌కు కేటాయించనున్నారు. ఈ సెంటర్‌కు అవసరమైన నిధులు మంజూరుకు మంత్రి హామీ ఇచ్చారు. దీంతో త్వరలోనే డయాలసిస్ సెంటర్ అందుబాటులోకి రానుంది.

హైస్పీడ్.. సిద్ధం



- హైదరాబాద్ - చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ నమూన



- ఎలివేటెడ్ రైల్ కారిడార్‌కు డీపీఆర్
- గుంటూరు మీదగా హైదరాబాద్ - చెన్నైకు ప్రాజెక్టు
- పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల మీదగా ఎలైన్‌మెంట్

1 తెలంగాణలోని ఖమ్మం మీదగా అమరావతి రాజధాని, నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి విమానాశ్రయం, చెన్నై ఓఆర్ రోడ్డు మీదగా చెన్నై సెంట్రల్.

2 హైదరాబాద్, శంషాబాద్, భారత్ సిటీ, దాచేపల్లి(నడికుడి), నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి ఎయిర్‌పోర్టు, చెన్నై ఓఆర్ రోడ్డు, చెన్నై సెంట్రల్.

బాపట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు నివేదిక సిద్ధమైంది. దక్షిణ మధ్య రైల్వే(కన్‌స్ట్రక్షన్స్) విభాగం డీపీఆర్‌ని సిద్ధం చేసి రైల్వేబోర్డుకు నివేదించనున్నది. ఈ కారిడార్ మొత్తం పొడవు 760 కిలోమీటర్లు కాగా అందులో 504 కిలోమీటర్లు ఏపీలో ఉండగా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల మీదగా ఎలైన్‌మెంట్ ఉన్నది. ఇప్పుడున్న ఎస్ఎస్ఆర్ రేట్స్ ప్రకారం ప్రాజెక్టు ఖర్చు రూ.3.04 లక్షల కోట్లు అవుతుందని అంచనా. డిజైన్ స్పీడ్ గంటకు 350 కిలో మీటర్లు కాగా ఆపరేషనల్ స్పీడ్ 320 కిలోమీటర్లుగా పొందుపరిచారు. మొత్తం తొమ్మిది రైల్వేస్టేషన్లు రాష్ట్రంలో ఉంటాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం దాదాపుగా 90.315 హెక్టార్ల అటవీ భూమి అవసరం అవుతుంది. దేశంలో ప్రప్రథమంగా హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు కొన్నేళ్ల క్రితం ముంబై - అహ్మదాబాద్ మధ్య నిర్మాణం ప్రారంభించారు. ఇది ఇంకా పూర్తి కాలేదు. కాగా ఎన్‌డీఏ ప్రభుత్వం మరో హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్‌ని హైదరా బాద్ - చెన్నై (మిగతా 8వ పేజీలో)

'పెమ్మసాని' చొరవతో ఏపీకి రూ.665 కోట్లు

● విడుదల చేసిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ

గుంటూరు సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో ఉపాధి హామీ పనుల కింద ఏపీకి రూ.665 కోట్ల విలువైన మెటీరియల్ కాంపోనెంట్‌ను కేంద్రప్రభుత్వం బుధవారం మంజూరు చేసింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి కేంద్రం ఈ నిధులను విడుదల చేసింది. ఈ నిధులు రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల మెటీరియల్ ఖర్చులకు ఉపయోగపడనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులలో భాగంగా అవసరమైన మెటీరియల్ నిమిత్తం ఈ కాంపోనెంటును గ్రామీణాభి వృద్ధిశాఖ కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ విడుదల చేశారు. ఏడాదిన్నర కాలంగా ఏపీలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేయించిన వ్యక్తులకు ఈ మెటీరియల్ కాంపోనెంట్ విడుదల దోహదపడనుంది. ఇందుకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పెమ్మసాని ధన్యవాదాలు తెలియజేశారు.

అన్నపర్రు ఘటనపై విచారణ

హాస్టల్లో వంట మనిషి, విద్యార్థులను విచారించిన న్యాయాధికారి



విద్యార్థులను విచారిస్తున్న బాపట్ల 6వ కోర్టు అడిషనల్ జడ్జి శ్యాంబాబు

పెదనందిపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అన్నపర్రు బీసీ బాలుర వసతి గృహంలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై బుధవారం విచారణ జరిగింది. జిల్లా కోర్టు జడ్జి ఆదేశాల మేరకు బాపట్ల 6వ కోర్టు అడిషనల్ జడ్జి శ్యాంబాబు వసతి గృహంలోని విద్యార్థులు, వార్డెన్, వంట మనిషిని విచారించారు. ముందురోజు ఇచ్చిన ఆహారం, తయారీ విధానం, మెనూ, సిబ్బంది పనితీరు ఇలా పలు అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. వసతి గృహంలో విద్యార్థులకు ఇంకా సమకూర్చాల్సిన వసతులపై ఆరా తీశారు. సమగ్ర నివేదిక తయారుచేసి జిల్లా ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీకి అందజేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపల్ సీనియర్ అసిస్టెంట్ జడ్జి జి.వాణి, ఎంపీడీవో స్వామిరెడ్డి, పీఎల్‌వీ ఐ.మాణిక్యరావు ఉన్నారు.

పత్తి కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహించాలి

● మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీత




ప్రసంగిస్తున్న మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీత

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లను వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో పారదర్శకంగా నిర్వహించాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్, డైరెక్టర్ విజయ సునీత ఆదేశించారు. బుధవారం గుంటూరు ఏఎంసీ(మిర్చియార్డు) మీటింగ్ హాల్‌లో పత్తి కొనుగోళ్లపై అనంతపురం, కర్నూలు, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణ, ప్రకాశం జిల్లాల మార్కెటింగ్ అధికారులకు పునశ్చరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ విజయ సునీత మాట్లాడుతూ గత ఏడాదితో పోల్చితే పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొన్ని మార్పులు చేసిందన్నారు. వాటిపై ప్రతి ఒక్కరూ స్పష్టమైన అవగాహన కలిగిఉండాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. పత్తి పండించిన రైతులు తొలుత సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వచ్చేలా సమాచారం అందించాలన్నారు. అక్కడ గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ) అందుబాటులో ఉండి సీఎం యాప్‌లో రైతు ఆధార్, మొబైల్ నంబరుని నమోదు చేసి వివరాలను నమోదు చేయాలన్నారు. అవి ఆటోమేటిక్‌గా కపాస్ కిసాన్ యాప్‌లోకి వస్తాయన్నారు. కపాస్ కిసాన్ యాప్ అనేది అందరూ వినియోగించుకోవచ్చన్నారు. స్లాట్ బుకింగ్ జరిగిన తర్వాత తిరిగి సీఎం యాప్‌లో గత ఏడాది వలే ప్రత్తి కొనుగోళ్ల ప్రక్రియని సూపర్‌వైజర్ లాగిన్ ద్వారా చేయాల్సి ఉంటుందన్నారు. చివరగా సంబంధిత ఏఎంసీ సెక్రెటరీ క్రాస్ చెక్ చేసి ఆమోదం తెలపాలి. అప్పుడే తక్‌పట్టి జనరేట్ అవుతుందన్నారు. ఆ తర్వాతనే సీసీఐ అధికారి పరిశీలన చేసి సంబంధిత రైతు బ్యాంకు ఖాతాకు నగదు జమ చేసేలా చూస్తారన్నారు.

ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 4,56,107 హెక్టార్లలో పత్తి పంటని సాగు చేశారని, దాదాపుగా 8 లక్షల టన్నుల పత్తి దిగుబడికి అవకాశం ఉందన్నారు. బేల్స్‌లోకి లెక్కిస్తే 15, 23,809 వస్తాయన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ ప్రకారం ఇప్పటి వరకు 4,26,477.25 హెక్టార్ల పంట నమోదైందన్నారు. తేమ శాతం విషయంలో ఒక శాతం మాత్రమే సడలింపు ఉంటుందన్నారు. స్లాట్ బుకింగ్ చేసిన రోజునే ప్రత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాల్సి ఉంటుందని, లేకుంటే అది రద్దు అవుతుందన్నారు. రైతులు కచ్చితంగా కొనుగోలు కేంద్రానికి రావాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఐ జనరల్ మేనేజర్ రాజేంద్ర షా, మార్కెటింగ్ జేడీలు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, సుధాకర్, డీడీ దివాకర్, జీఏంసీ సెక్రెటరీ ఏ చంద్రిక, ఏడీ సత్యన్నారాయణ చౌదరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 49,335 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతో పాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 54,865 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.6 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 49,335 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 2,523 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 3,007 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటిమట్టం బుధవారం నాటికి 587.50 అడుగులు ఉంది. ఇది 305.80 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,800, ఎడమ కాలువ ద్వారా 7,937, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,723, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 52,560 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 52,560 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నిరాటంకంగా విద్యుదుత్పత్తి..

రెంటచింతల,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన రెండు యూనిట్ల ద్వారా మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0722 ఎంయూల విద్యుదుత్పత్తి చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు చెప్పారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 3 గేట్లను ఒక మీటర్ మేర ఎత్తి 12702 క్యూసెక్కులు,టేల్ రేస్ చానల్ ద్వారా 8,672 క్యూసెక్కులు మొత్తంగా 21,374 క్యూసెక్కుల నీరు పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల జలపాతం, హాలియా వాగుల నుంచి 32,723 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానం.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

● మంత్రి అనగాని

రేపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. రెవెన్యూ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చెయ్యాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. మత్స్యకారులెవరూ చేపల వేటకు వెళ్లొద్దని, ప్రజలు అనవసర ప్రయాణాలు మానుకోవాలన్నారు. ఈదురు గాలులతో కూడిన వర్షాల కారణంగా చెట్లువిరిగిపడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజారవాణా కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు, బాపట్ల, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులంతా సహాయ చర్యల్లో పాల్గొనాలని మంత్రి ఆదేశాలు జారీచేశారు.

కల్తీ మద్యం కట్టడికి సురక్షా యాప్ : చీఫ్‌విప్ జీవీ

వినుకొండటౌన్, అక్టోబరు 22: కల్తీ మద్యం పేరు వినిపిస్తేనే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కల్తీ మద్యం అన్న మాటే వినిపించకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుందన్నారు. ఇందుకు నూతనంగా సురక్షా మొబైల్ యాప్‌ను తీసుకొచ్చిందని చెప్పారు. దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానిక ఎక్సైజ్ అధికారులు, మద్యం దుకాణదారులపై ఉందన్నారు. అక్రమ మద్యం నివారణకు ఈ నెల 29 వరకు వారం రోజుల పాటు ప్రజా భద్రతా అవగాహన ప్రచారాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. నాయకులు స్థానిక మద్యం దుకాణాలను సందర్శించాలన్నారు.

ఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏప్రిల్‌లో జరిగిన ఫార్మసీ రివాల్యూషన్ పరీక్ష ఫలితాలను బుధవారం పరీక్షల నియంత్రణ అధికారి శివప్రసాద్ విడుదల చేశారు. జూలైలో జరిగిన నానోటెక్నాలజీ సెమిస్టర్ ఫలితాలను కూడా విడుదల చేశారు. వచ్చే నెల 3లోగా రూ.1860 చెల్లించి రివాల్యూషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

10న పెదకాకాని ఎంపీపీ అవిశ్వాస ఎన్నిక

● పర్యవేక్షించనున్న గుంటూరు ఆర్డీవో

పెదకాకాని, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని ఎంపీపీ తులిమిల్లి శ్రీనివాసరావుపై ఎంపీటీసీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఎన్నికను నవంబరు 10వ తేదీన నిర్వహించనున్నట్లు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు గుంటూరు జిల్లా కలెక్టర్ అన్సారియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు ఆర్డీవో కె.శ్రీనివాసరావును విశ్వాస తీర్మాన ఎన్నికలు పర్యవేక్షించాలని ఆదేశించారు. దీంతో వచ్చే నెల 10వ తేదీన ఎంపీపీ అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఓటింగ్ జరగనుంది. పెదకాకాని మండలంలో మొత్తం 12 గ్రామ పంచాయతీలలో 21 మంది ఎంపీటీసీ సభ్యులున్నారు. వారిలో 14 మంది అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా సంతకాలు పెట్టి జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటికే టీడీపీ వైపున మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు చేరిపోయారు. ప్రస్తుతం ఎంపీపీ శ్రీనివాసరావును దించేసి, కొత్తగా టీడీపీ తరఫున ఎంపీపీని ఎన్నుకోవాలని నాయకులు భావిస్తున్నారు. మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్న కొప్పురావూరు ఎంపీటీసీ సభ్యుడు కామినేని శ్రీనివాసరావును ఎన్నుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

తల్లి మీద బెంగతో కొడుకు ఆత్మహత్య

తెనాలి క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తల్లి ఇంటికి రావడం లేదనే బెంగతో కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం కంచర్లపాలెంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. కంచర్లపాలెం వాటర్ ప్లాంట్‌లో పని చేస్తున్న పందిపాటి ప్రిన్స్ (19) బుధవారం తన ఇంటిలో ఎవరు లేని సమయం చూసి ఫ్యాన్‌కి లుంగీతో ఉరి వేసుకున్నాడు. అయితే.. తల్లితండ్రుల మధ్య డబ్బులు విషయంలో గొడవలు జరిగాయి. దీంతో తల్లి పుట్టింటికి వెళ్లిపోయింది. ఎన్నిసార్లు పెద్దలు సంప్రదింపులు జరిపినా తిరిగి రాలేదు. దీంతో తల్లి మీద బెంగ పెంచుకున్న ప్రిన్స్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి ఆహ్వానం



వెంకయ్యనాయుడును కలిసిన డాక్టర్ గజల్ శ్రీనివాస్ దంపతులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సారస్వత పరిషత్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 5 వరకు గుంటూరులో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, సురేఖ దంపతులు ఆహ్వానం పలికారు. మహాసభల్లో భాగంగా 5న సమాపనోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవ్వాలని వెంకయ్యనాయుడుని వారు కోరారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించారని డాక్టర్ గజల్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ప్రజలకు మేలు చేస్తే జగన్‌కు నచ్చదు

● ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాలు దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నంబరు వన్‌గా నిలిపే విధంగా ఉన్నాయని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పారిశ్రామిక వేత్తలు కూటమిపై ఉన్న నమ్మకంతో ఏపీ వైపు వస్తున్నారన్నారు. దీనిని అడ్డుకునేందుకు వైసీపీ కావాల్సినంత విష ప్రచారం చిమ్ముతోందన్నారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు మరికొన్ని రాష్ట్రాలు ప్రయత్నించినా ఏపీ వైపే మొగ్గు చూపడం.. కూటమి ప్రభుత్వం కృషి వల్లే సాధ్యమైందని.. ఐటీ రంగం నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారన్నారు. నియోజకవర్గానికి చెందిన మెగా డీఎస్సీ ఉపాధ్యాయులతో వచ్చే నెలలో గెట్ టు గెదర్ ఏర్పాటు చేస్తామన్నారు. వరంగల్ జిల్లాలోని ఓ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న అధునాతన పద్ధతులు, పంటల సాగు విధానంపై వచ్చే నెలలో వ్యవసాయ అధికారులు, రైతులతో ముఖాముఖి, పంటల సందర్శన చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో కొమ్మినేని రామచంద్రరావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ వీరాస్వామి, కనిగిరి శ్రీను, దియ్యా రామకృష్ణ, వడ్డవల్లి సాంబశివరావు, గండికోట వెంకటేశ్వర్లు, బాబావలి, తంగెళ్ల శ్రీను, కోట హరి, యడ్లపల్లి శివ, నారాయణ, నల్లపాటి నెహ్రూ, పర్వతనేని రామారావు, వున్నం వెంకట్రావు, చింతలపూడి రామ్మూర్తి, కారు సైదా, మేకల రాంబాబు, అనబోతుల నర్సిరెడ్డి, వల్లెపు రామకృష్ణ, తెలుగుయువత ఖాశిం, నర్రా సాంబశివరావు, మేకల మస్తాన్, మీనిగల అంజిబాబు, లంజేపల్లి కొండలు పాల్గొన్నారు.

నకిలీ డీఎస్పీ అరెస్టు

చిలకలూరిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నకిలీ డీఎస్పీ అవతారం ఎత్తి పోలీసు ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన ఒక యువకుడిని చిలకలూరిపేట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాస్ (35) అనే యువకుడు స్థానిక సుగాలీ కాలనీలో నివాసముంటున్నాడు. పోలీస్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి. స్థానిక గుండయ్య తోటకు చెందిన ధూపాటి భులక్ష్మి అనే యువతి వద్ద రూ.30 వేలు తీసుకున్నాడు. గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్దకు ఆమెను తీసుకువెళ్లి పోలీసు యూనిఫాం, బ్యాడ్జి, లాఠీ, టోపీ ఇచ్చాడు. ఉద్యోగం వచ్చిందని భావించి ఇంటికి వచ్చిన బాధితురాలికి అసలు విషయం బోధపడింది. మోసపోయినట్టు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు జరుపగా ఆ యువకుడు పలు నేరాలకు పాల్పడినట్టు తెలుసుకున్నారు. మార్కాపురం, రాజమండ్రి, మేడికొండూరు, త్రిపురాంతకం, నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్లలో అతడిపై కేసులో ఉన్నట్లుగా గుర్తించారు. చిలకలూరిపేట కేసులో ముద్దాయిగా ఉన్న అతనిని బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం రిమాండ్‌కు పంపారు. చిలకలూరిపేట అర్బన్ సీఐ పి.రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య కళాశాలకు.. పూర్వ విద్యార్థుల రూ.కోటి విరాళం

గుంటూరు మెడికల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల 1980వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కాలేజీలోని వివిధ విభాగాల అభివృద్ధికి కోటి రూపాయల విరాళం ప్రకటించారు. ఈ మేరకు వారు ఈ విషయాన్ని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారికి తెలిపారు. ఈ బ్యాచ్‌కు చెందిన అమెరికాలో స్థిరపడిన ఎన్నారై డాక్టర్ లీలా తన తల్లిదండ్రుల పేరిట రూ.51 లక్షల విరాళం ప్రకటించారు. డాక్టర్ లీలా అందజేసే విరాళంలో రూ.25 లక్షల వ్యయంతో ఫిజియాలజీ ల్యాబ్‌ను, రూ.26 లక్షలతో మైక్రోబయాలజీ ల్యాబ్‌ను ఆధునికరించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి తెలిపారు. మిగిలిన పూర్వ విద్యార్థులు అందజేసే రూ.50 లక్షలతో బయోకెమిస్ట్రీ ల్యాబ్‌ను ఆధునికరిస్తామని ఆయన ప్రకటించారు. తమ మాతృ విద్యాసంస్థ అభివృద్ధికి చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చిన 1980వ బ్యాచ్ పూర్వ విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాళ్ల డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి అభినందించారు.

నిందితుడికి జీవిత ఖైదు.. జరిమానా

నరసరావుపేట లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భార్యను అదనపు కట్నం కోసం వేధించిన నిందిగుడికి జీవిత ఖైదుతో పాటు రూ.20 వేల జరిమానా పడింది. ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన చల్లా అనిల్‌కుమార్‌కు నరసరావుపేట మండలం ఎక్కలవారిపాలెం గ్రామానికి చెందిన మచ్చ గాని వేమలమ్మకు 2015లో వివాహమైంది. చెడు వ్యసనాలకు బానిసైన నిందితుడు అనిల్‌కుమార్ తన భార్యను అదనపు కట్నం కోసం వేధించేవాడు. ఈ నేపథ్యంలో వేమలమ్మ అతని వేధింపులు భరించలేక 2019లో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు మృతురాలు తండ్రి శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో నేరం రుజువడంతో నిందితుడికి జీవితఖైదుతోపాటు రూ.20వేల జరిమానా విధిస్తూ నరసరావుపేట 13వ అదనపు జిల్లా అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి డాక్టర్ నేతి సత్య శ్రీ బుధవారం తీర్పు ఇచ్చారు. ఈ కేసు ప్రాసిక్యూషన్ ఏపీపీ గుండాల సురేష్ బాబు నిర్వహించారు.

ద్విచక్ర వాహనదారుడి మృతి

భట్టిప్రోలు (కొల్లూరు) అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందినట్లు ఎస్ఐ ఎం.శివయ్య బుధవారం తెలిపారు. రేపల్లె మండలం బేతపూడి గ్రామానికి చెందిన ఆలూరి మహేష్‌బాబు (28) మంగళవారం అమృతలూరులో ఉన్న తన ద్విచక్ర వాహనాన్ని తీసుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. ఓలేరు సమీపంలోకి చేరుకోగా ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్ల ఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా రెవెన్యూ సర్వీసెస్ క్రీడా పోటీలు



రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

గుంటూరు (క్రీడలు), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జిల్లా రెవెన్యూ సర్వీసెస్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. విధి నిర్వహణలో ప్రతినిత్యం సతమతమయ్యే రెవెన్యూ ఉద్యోగులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్ క్రీడాంశాలలో ఉద్యోగులు ఒకరితో ఒకరు తలపడ్డారు. ఈ పోటీలలో ప్రతిభను చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనునట్లు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్‌కుమార్, వెంకటరావు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడల నిర్వహణకు సహకరించిన జిల్లా అధికారులకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పత్తి కొనుగోలు..ఉత్తిదేనా!

(5వ పేజీ తరువాయి)

ఇప్పటికే పదిరోజులు దాటింది. తాజాగా నిబంధనల సాకు చూపి మొత్తంగానే వైదొలిగే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మళ్లీ దళారులే తమకు దిక్కవుతున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరు వేల ఎకరాల్లో సాగు చేయాలనే మెలిక

జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరవాలంటే కనీసం 6 వేల ఎకరాల్లో పత్తి సాగు జరగడంతో పాటు.. గతంలో జరిపిన సేకరణ కూడా ఆశాజనకంగా ఉండాలనే నిబంధనలను అధికారులు తెరపైకి తెస్తున్నారు. ఈ ఏడాది బాపట్ల జిల్లా వ్యాప్తంగా 4,500 ఎకరాల్లో పత్తి సాగయ్యింది. ఇదంతా పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లోని పది మండలాల పరిధిలోనే ఉన్నట్లు వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి. దాదాపుగా 40 వేల క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. గతేడాది కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు సీసీఐ సేకరించింది జిల్లా వ్యాప్తంగా 13 వేల క్వింటాళ్లుగా ఉంది. నిబంధనల ప్రకారం ఇది చాలా కనిష్ఠమని, ఇదే కాకుండా సాగు విస్తీర్ణం కూడా ప్రతిబంధకంగా మారిందని అధికారులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంపై నవంబరు మొదటి వారంలో స్పష్టత వస్తుందని యంత్రాంగం చెబుతోంది. ఇదిలా ఉంటే జిల్లాలో రెండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని గతంలో మార్కెటింగ్‌శాఖ ప్రకటనను రైతులు గుర్తుచేస్తూ.. ఇప్పుడు నిబంధనల సాకుతో పునరాలోచన చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు

దిగుబడుల్లో భారీ కోత

ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాలు నమోదయ్యాయి. పర్చూరు నియోజకవర్గ పరిధిలో అధికంగా కుండపోత వానలు పలుసార్లు నమోదయ్యాయి. ఈ ప్రభావంతో ఎకరానికి 12 క్వింటాళ్ల వరకు వచ్చే దిగుబడి, ప్రస్తుతం 8 నుంచి 9 క్వింటాళ్లకే పరిమితమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి మద్దతు ధర క్వింటాకు రూ.8,110 ఉండగా, ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.7,200 నుంచి రూ.7,500 వరకు పలుకుతోందని రైతులు చెబుతున్నారు. క్వాలిటీ ఉన్న పత్తికే ఈ ధర చెల్లిస్తున్నారని, లేదంటే రూ.7 వేల దిగువకే అడుగుతున్నారని వాపోతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

29,896 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 31,782 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 29,896 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,464 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12500
334	10000	14800	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14500	334	10500	15000
273	----	----	నెంబరు. 5	10000	14800
341	10000	15500	273	10000	13500
4884	----	----	341	10000	15800
సూపర్ 10	----	----	సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15300	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15200
బ్యాడిగి	10500	15500	దేవనూరు డీలక్స్	10500	14700
దేవనూరు డీలక్స్	10000	14500	తాలుకాయలు	5000	8000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



డ్రైనేజి నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. 34వ వార్డు దర్శిపెదమస్తాన్ నగర్ శ్రీకృష్ణదేవాలయం దగ్గర డ్రైనేజి నిర్మాణ పనులను బుధవారం ఆయన నాయకులు, అధికారులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాధాన్యత ప్రకారం ప్రతివార్డులో అభివృద్ధి పనులు చేపడుతామని చెప్పారు. అనంతరం వార్డులోని డ్రైనేజిలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, కార్పొరేషన్ డైరెక్టర్‌లు మందపాటి ఆంధ్రేయ, దుర్గాప్రసాద్, నాయకులు శీలం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పట్టణంలోని 14వ వార్డు కారుమూరి హనుమంతరావు కాలనీలో లోవోల్టేజి సమస్యను పరిష్కరించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే నరేంద్రవర్మ బుధవారం ప్రారంభించారు. దీనివల్ల వార్డులో ఇకపై లోవోల్టేజి సమస్య తలెత్తదని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు, నాయకులు జిట్టా శ్రీనివాసరావు, అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఆ ప్రాంత ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

రుణాలు అందించేందుకు పీఏసీఎస్‌ల పాత్ర కీలకం : వేగేశన

పిట్టలవానిపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సహకార సంఘాల ద్వారా సకాలంలో రుణాలు అందించేందుకు పీఏసీఎస్‌ల పాత్ర కీలకమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో బుధవారం నూతనంగా ఏర్పడిన ఖాజీపాలెం వ్యవసాయ ప్రాథమిక పరపతి సహకార సంఘం నూతన కమిటీ చైర్మన్‌గా మెండు శివపార్వతి కిషోర్‌లతో పాటు డైరెక్టర్‌లుగా యెనుముల శ్రీనివాసరావు, మర్రిపూడి శామ్యూల్‌లతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రమాణస్వీకారం చేయించారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ నియోజకవర్గంతోపాటు పిట్టలవానిపాలెం మండలంలో ఇప్పటికే నాలుగు సహకార సంఘాలను ఏర్పాటు చేసి రైతులకు యూరియా, ఎరువులను అందించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, టీడీపీ సీనియర్ నాయకుడు లక్కంరాజు వెంకటపతిరాజు, చందోలు టీడీపీ యువనాయకులు సయ్యద్ నిజాం, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు మహ్మద్ హుస్సేన్ (దాదా), శ్రీలింగోద్భవదేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు పరిమి రామకృష్ణ సాయిబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కనుమూరి సాంబమూర్తిరాజు, ఖాజీపాలెం టీడీపీ అధ్యక్షులు కొత్తపల్లి పృధ్వీరాజు, టీడీపీ నాయకులు మంతెన కృష్ణమూర్తిరాజు, ఆయా సొసైటీల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాసరాజు, ఎంపీడీవో సీహెచ్ శేఖర్, డిప్యూటీ ఎంపీడీవో దాసరి వెంకటశివకుమార్, చందోలు ఎస్‌ఐ ఎం.శివకుమార్, ఉయ్యూరు వెంకటేశ్వరరావు, పెనుమెత్స మూర్తిరాజు, మార్కెట్ యార్డు డైరెక్టర్ నిజాంపట్నం నాగరాజు, ఖాజీపాలెం గ్రామపెద్దలు పలువురు, రైతులు పాల్గొన్నారు.

పంచారామాలకు బస్సు సర్వీస్‌లు : ఆర్టీసీ డీఎం

బాపట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీకమాసం సందర్భంగా బాపట్ల ఆర్టీసీ డిపో నుంచి 5 పంచారామాలైన సామర్లకోట, దాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతిలోని శైవక్షేత్రాలు దర్శనార్థం ప్రత్యేక సూపర్ లగ్జరి బస్సు సర్వీస్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్.గురవారెడ్డి తెలిపారు. కార్తీక ఆదివారాలు అక్టోబరు 26, నవంబరు 2, 9, 16 తేదీలలో బాపట్ల నుంచి రాత్రి 8 గంటలకు బస్సు బయలుదేరి సోమవారం 5 పంచారామ శివాలయాలు దర్శనం చేసుకొని రాత్రికి బాపట్ల వస్తుందన్నారు. పెద్దలకు రూ.1350, పిల్లలకు రూ.1020 ఛార్జీ ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో సీట్లు ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవచ్చు అన్నారు.

స్వామివారి ఆశీస్సులతో ప్రతి ఏడాది చద్ది

● మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్



అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న సతీష్ ప్రభాకర్

బాపట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి దివ్య ఆశీస్సులతో ప్రతి ఏడాది 41 రోజులపాటు చద్ది నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని శ్రీగంగా పార్వతి సమేత శ్రీసోమేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో బుధవారం చద్ది కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా స్వామివారికి పూజలు చేసి మెట్లపూజ నిర్వహించి అయ్యప్ప స్వాముల భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. తదుపరి దీక్షాపరులైన స్వాములకు చద్ది వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 21 సంవత్సరాలుగా మాలాధారణ చేసిన స్వాములకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్పస్వామి ఆశీస్సులు ఉన్నంత కాలం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ బూర్లె రామసుబ్బారావు, కొటికం సుబ్బారావు గురుస్వామి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వై.లక్ష్మీనారాయణ, నియోజకవర్గ అధ్యక్షులు కొండారెడ్డి అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

నూతన చెక్ పోస్ట్ ప్రారంభం

కర్లపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలో బాపట్ల మార్కెట్ యార్డు కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను బుధవారం బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ ఏపూరి భూపతిరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జి.కృష్ణ, దొప్పలపూడి రాజశేఖర్, మార్కెట్ యార్డు సెక్రటరి, మార్కెట్ యార్డు సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం : డీఎంహెచ్‌వో

కర్లపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రక్తదానంతో అనేక ప్రాణాలను రక్షించే అవకాశం లభిస్తుందని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ అన్నారు. ప్రముఖ సమాజ సేవకులు, కేర్ మినిస్ట్రీస్ అధినేత మోపర్తి జన్మదినం సందర్భంగా గుంటూరు నీడ్స్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈ శిబిరాన్ని ఆర్డీవో గ్లోరియా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 200 మంది యువకులు, సామాజిక సేవకులు, ప్రజలు పాల్గొని రక్తదానం చేశారు. ఆర్డీవో గ్లోరియా, కర్లపాలెం తహసీల్దార్ షాకీర్ పాషా, బాపట్ల తహసీల్దార్ సలీమా, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ పాల్గొని రక్తదాతలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. డాక్టర్ నిస్సి జోసఫ్, మిషన్ డైరెక్టర్ స్టీవ్‌కాలిన్స్, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు పూర్ణచంద్ర, సాంబశివరెడ్డి, అంటరాని తన నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చార్వాక, పరమానందకుమార్, ఆర్మీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాసంలో సముద్ర స్నానాలకు జిల్లాకు వచ్చే భక్తులకు అన్నిరకాల సదుపాయాలు కల్పించటం జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం ఎస్పీ బి.ఉమామహేశ్వర్‌తో కలిసి జిల్లాలో కార్తీక మాసంలో జిల్లాకు వచ్చే భక్తులకు చేసే ఏర్పాట్లపై పోలీసు, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య, పంచాయతీ, విద్యుత్, అగ్నిమాపక, పంచాయతీరాజ్, పర్యాటక, అటవీ మున్సిపల్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సూర్యలంక, చీరాల ఓడరేవు, రామాపురం బీచ్‌లకు భక్తులు లక్షలలో రావటం జరుగుతుందన్నారు. పర్యాటక ప్రాంతాలలో పారిశుధ్యం, శానిటేషన్, బ్లీచింగ్, సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి ఆదేశించారు. బీచ్‌ల వద్ద మెడికల్ క్యాంప్‌లతోపాటు అంబులెన్స్ ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖాధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలలో బోట్స్, గజ ఈతగాళ్ళు లైఫ్ జాకట్స్‌లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక, మత్స్యశాఖాధికారులను ఆదేశించారు. సముద్రస్నానాలకు వచ్చేవారి కోసం ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు.

ఎస్పీ బి.ఉమామహేశ్వర్ మాట్లాడుతూ బీచ్‌ల వద్దకు సీసీకెమెరాలతోపాటు డ్రోన్‌లు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. పోలీసు పెట్రోలింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా పర్యాటకులకు నిత్యం పలు సూచనలు జారీ చేయటం జరుగుతుందన్నారు. కార్తీక సోమవారాలలో భక్తులు అధిక సంఖ్యలో రావటం జరుగుతుందని, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భక్తులు సంతోషంగా స్నానాలు చేసి తిరిగి వెళ్ళే వరకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఏమైన సమస్యలు ఉంటే కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో డీపీవో ప్రభాకరరావు, డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, బాపట్ల, చీరాల ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలి

ఓడరేవు-చిలకలూరిపేట జాతీయ రహదారి 167ఎ నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జాతీయ రహదార్లు, స్వదేశీ దర్శన్ 2.0, ఆక్వా పార్క్ అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణ పనుల జాప్యంపై అధికారులను ఆరా తీశారు. ఓడరేవు, చిలకలూరిపేట జాతీయ రహదారి 167ఎలో 92.12 హెక్టార్‌లకు గాను 89.52 హెక్టార్‌లలో 3డి పూర్తి అయ్యిందని, 2.6హెక్టార్‌లు 3డి కావాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 92.38 శాతం పనులు పూర్తి అయినట్లు జాతీయ రహదారి అధికారులు కలెక్టర్‌కు వివరించారు. 2.6 హెక్టార్‌ల 3డి పనులను వారంరోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జాతీయ రహదారిపై భద్రత, జాగ్రత్తలను ఏర్పాటు చేయాలని, రహదారి వెంట మొక్కలను నాటాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

● సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయటానికి కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ 2.0 కింద 97.52 కోట్ల రూపాయల నిధులను విడుదల చేసిందని కలెక్టర్ తెలిపారు. సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులను 16వ తేది నుంచి ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికి పనులు ప్రారంభించకపోవుటకు గల కారణాలపై అధికారులను ఆరా తీశారు. పనులను వేగవంతం చేయాలని, ఏరోజుకు ఆరోజు పనుల పురోగతిని తెలియజేయాలని అధికారులకు సూచించారు.

● ఆక్వా పార్క్ 192.42 ఎకరాలలో అభివృద్ధి చేయనున్నట్లు కలెక్టర్ చెప్పారు. సమీకృత ఆక్వాపార్క్ నిర్మాణం ద్వారా ఆక్వా రంగం మరింత అభివృద్ధి కానుందన్నారు. సమీకృత ఆక్వా పార్క్ పనులను వెంటనే ప్రారంభించాలని, ప్రతిరోజు పురోగతిని తెలియజేయాలన్నారు. అదేవిధంగా నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు, కాంట్రాక్టర్‌లకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే డీఈ శ్రీనివాసరావు, మత్స్య శాఖ డీడీ గాలిదేవుడు, పర్యాటకశాఖాధికారి నాగిరెడ్డి, అటవీశాఖాధికారి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తులకు విలువ జోడించటంతో అధిక ఆదాయం

బాపట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ఉత్పత్తులకు విలువ జోడించటం ద్వారా, ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్‌లను నెలకొల్పటం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని పోస్ట్‌హార్వెస్ట్ టెక్నాలజి సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.ఏడుకొండలు తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రంలోని పోస్ట్‌హార్వెస్ట్ టెక్నాలజి సెంటర్‌లో రెండు మండలాల రైతులకు ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్స్ నెలకొల్పటంలో మెళుకువలు అనే అంశంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త డాక్టర్ వాసుదేవరావు రైతులకు వివిధరకాల యంత్రాల పనితీరుపై లైవ్ డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఏడీఏ ఎ.లక్ష్మి, నగరం మండల వ్యవసాయాధికారి సీహెచ్ విజయరాజు, నిజాంపట్నం మండల వ్యవసాయాధికారి వి.రమేష్‌బాబు, శాస్త్రవేత్తలు డాక్టర్ సందీప్ రాజా, డాక్టర్ వాసుదేవరావు, పావని తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్‌షాపు ప్రారంభం

బాపట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఐదు రోజుల వర్క్‌షాపు ప్రారంభించారు. జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాపునకు పాంటెక్ సొల్యూషన్స్ సంస్థకు చెందిన భరత్, అనుభర్షిణి పాల్గొని జనరేటివ్ ఏఐ ప్రాధాన్యత, ఉపయోగాలు, భవిష్యత్తు అవకాశాలపై విద్యార్థులకు మార్గదర్శకం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.హరిత, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జి.వెంకటేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ శంకరన్‌ను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి : కలెక్టర్



శంకరన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఆర్ శంకరన్‌ను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని శంకరన్ విగ్రహం వద్ద బుధవారం ఆయన జయంతి సందర్భంగా కలెక్టర్ పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు.

విజయవంతంగా మాజీ సైనికుల పర్యటన : తాండ్ర

బాపట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మాజీ సైనికుల రాష్ట్ర కమిటి గుంటూరు పర్యటన విజయవంతమైనట్లు మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు తెలిపారు. జిల్లా సైనిక వెల్ఫేర్ కార్యాలయాన్ని, మాజీ సైనికుల వైద్యశాలలను సందర్శించినట్లు తెలిపారు. జిల్లాలో జరుగుతున్న పరిస్థితులను జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ గుణషీలా దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. రూ.2.92 కోట్లతో నిర్మిస్తున్న గుంటూరు జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీస్ భవన నిర్మాణాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శివకుమార్, గౌరవాధ్యక్షులు అన్నె రామారావు, రాష్ట్ర కమిటీ సలహాదారులు శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షులు బాల శివారెడ్డి, ఆదిశేషారెడ్డి, మస్తాన్, నరసింహం, ప్రసాద్, మహ్మద్ గౌస్ పాల్గొన్నారు.

శివనామస్మరణతో మారుమోగిన శివాలయాలు


● ఆలయాలకు పోటెత్తిన భక్తులు

రేపల్లె, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం ప్రారంభంకావటంతో బుధవారం నియోజకవర్గంలోని శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శివనామ స్మరణతో శివాలయాలు మారుమోగాయి. పట్టణంలోని ఇసుకపల్లి చెన్నమల్లేశ్వరస్వామి, స్వయంభు రామలింగేశ్వరస్వామి దేవాలయంలో, మండలంలోని దక్షిణ కాశీగా పేరొందిన మోర్తోట ముక్తేశ్వరస్వామి, చౌడేశ్వరస్వామి దేవాలయం, తెల్లవారుజాము 4 గంటల నుంచే భక్తులు పెద్దసంఖ్యలో కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. శివాలయాల్లో అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి 11 రుద్రాల అభిషేకం, పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో రుద్రాభిషేకంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఏవో దివి వెంకటఅప్పలాచార్యులు ఏర్పాట్లు చేశారు. భక్తులు తొలిరోజున పోటెత్తి పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో చెన్నమల్లేశ్వరస్వామి, పూజల్లో పాల్గొన్న భక్తులు

వేమూరులో...



జంపని రామేశ్వరస్వామి

వేమూరు, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి) : కార్తీక మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజాము నుంచి శివాలయాల్లో విశేషంగా కార్తీక మాస నిత్య అభిషేక కైంకర్యాదులు ప్రారంభించారు. జంపని, వేమూరు, చావలి, పెరవలి, అబ్బనగూడవల్లి, చంపాడు, బూతుమల్లి, చదలవాడ, బలిజేపల్లి, వెల్లబాడు గ్రామాలలోని శివాలయాల్లో శైవ ఆగమం ప్రకారం అర్చకులు తెల్లవారుజామున శివునికి నమక చమకాలు, పంచసూక్తాలు, రుద్ర మంత్రాలతో విశేషంగా పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం స్వామి వారిని అలంకరించి భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపారు. కార్తీక స్నానాలు ఆచరించిన భక్తులు తెల్లవారుజామునే శివాలయాలను, విష్ణాలయాలను సందర్శించి కార్తీక దీపారాధనలు చేసి స్వామిని దర్శించుకున్నారు.

గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చుండూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని మలేరియా విభాగం అధికారి తుల్లిమిల్లి కోటేశ్వరరావు తెలిపారు. పెనుగుదురుపాడులో దోమల నివారణపై బుధవారం గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు దోమల వలన వ్యాప్తి చెందుతాయన్నారు. ఇంటి పరిసరాలలో మురుగునీరు, వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటింటి ప్రచారం వైద్య సిబ్బందితో కలిసి చేశారు. డిప్యూటీ హెచ్ఈడీ పోలే కోటేశ్వరరావు, బళ్లా రాధాకృష్ణ, శిఖావల్లి, జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

చేతికొచ్చే పంటలు వర్షం పాలు

● ఆవేదనలో అన్నదాతలు

కొల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టించి ఎన్నో వ్యయ ప్రయాసలతో సాగు చేసిన వరి పంట చేతికొచ్చే సమయంలో వర్షాలకు నేలవాలిపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న వరి పైరునేలవాలి వర్షపు నీటిలో నానుతుంది. కొన్ని పైర్లు కొద్దిరోజుల్లో కోతకు వచ్చే దశలో ఉండటం, కంకి మీద ఉండి పాలు పోసుకుంటున్న పైర్లు, అసలు కంకి రాని వరి పైర్లు సైతం వర్షం తీవ్రతకు నేలవాలాయి. మెట్ట భూములతో పాటు మాగాణిలో కొన్ని చోట్ల వేసిన మినుము పైరులో వర్షపు నీరు నిలిచింది. మొసలిపాడు వద్ద సాగు చేస్తున్న బంతి పూల తోటలో కూడా వర్షపు నీరు చేరింది. అల్పపీడన ప్రభావంతో మూడు నాలుగు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో వరి, మినుము వేసిన రైతులు పూర్తిగా దెబ్బతినిపోతాయని ఆందోళన చెందుతున్నారు.

వర్షపు గాలులకు పడిపోయిన వరి పైర్లు

వేమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు కురుస్తున్న వర్షం, గాలులకు చేతికొచ్చిన వరి పైర్లు నేలకొరిగాయి. రెండు, మూడు రోజుల్లో కోతకు సిద్ధమైన పైర్లతో పాటు పొట్ట దశలో ఉన్న పైర్లు పాలు పోసుకునే దశలో పైర్లు నేలకు ఒరిగాయి. కొన్ని పైర్లు చిందరవందరగా పడిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే పద్ధతిలో వర్షాలు కురిస్తే చేతికందే పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు పంటలు దెబ్బదింటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మినుము పైరులో నిలిచిన వర్షపు నీరు



పెరవలి డొంక మార్గంలో పడిపోయిన వరి పైర్లు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో

రేపల్లె, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం 22 నుంచి 26వ తేదీ వరకు బాపట్లజిల్లాలో అతిభారీ వర్షపాతం సంభవించే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. రేపల్లె డివిజన్ మండలాల్లో నదీ పక్కన, తక్కువ ఎత్తులో నివశించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా మండలాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని సూచించారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో 08648 293795, ఫోన్‌నెంబర్ ఏర్పాటు చేయటం జరిగిందని, ఏమైనా ఇబ్బందులు ఉంటే ఈనెంబర్‌కు కాల్‌చేసి తెలపాలని సూచించారు.

● వేమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో ఆకస్మికంగా వరదలు సంభవించే ప్రమాదం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికను అనుసరించి మండల పరిధి గ్రామాల స్థాయిలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ సుశీల సూచించారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే గ్రామస్థాయిలో కానీ మండల స్థాయిలో కానీ అధికారులకు ఫోన్ సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

● పిట్టలవానిపాలెం,అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు గ్రామపంచాయతీ రెడ్లపాలెం గ్రామంలో వర్షాల కారణంగా ఎలాంటి విపత్తులు జరగకుండా మండల స్థాయి అధికారులతో చర్యలు చేపట్టినట్లు పిట్టలవానిపాలెం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. వర్షాలు దృష్టిలో పెట్టుకొని గ్రామపంచాయతీ కార్యదర్శులకు, వీఆర్వోలకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ శేఖర్, మండల స్థాయి అధికారులు, చందోలు ఎస్‌ఐ ఎం.వెంకటశివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్‌తో ఎమ్మెల్యే ఆనందబాబు భేటీ



జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాతో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

గుంటూరు సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాతో ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు బుధవారం భేటీ అయ్యారు. చైర్ పర్సన్ క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో పంచాయతీరాజ్ ద్వారా జరుగుతున్న పనులపై చర్చించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ కూడా పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వం ఇష్టం లేక ఇబ్బందులు పెట్టింది

● టైం స్కేల్ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ చంద్రపాల్

వేమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఐదు సంవత్సరాలు పాలన చేసిన జగన్ ప్రభుత్వం టైం స్కేల్ సిబ్బంది శాశ్వత పరిష్కారం విషయంలో అయిష్టంగా వ్యవహరించడంతో పాటు తమను అనేక ఇబ్బందులకు గురిచేసిందని గ్రామ పంచాయతీ టైం స్కేల్ సిబ్బంది బాపట్ల జిల్లా సంఘం కన్వీనర్ వేమూరి చంద్రపాల్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టైం స్కేల్ సిబ్బంది 450 మంది సమస్యలను పరిష్కరిస్తూ కూటమి ప్రభుత్వం బుధవారం 142 జీవో అమలుకు ఆమోదం తెలపడంతో ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో పాటు ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వేమూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, దశాబ్దాలుగా వెట్టిచాకిరి చేయించుకుంటున్న గ్రామ పంచాయితీ డిపార్ట్‌మెంట్ ఈ జీవో అమలును గత ప్రభుత్వంలో తీవ్రంగా అడ్డుకుందన్నారు.

మహిళలకు రక్షణ దన్నుగా శక్తి యాప్

వేమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి యాప్ మహిళల రక్షణకు దన్నుగా నిలుస్తుందని వేమూరు ఎస్‌ఐ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో బాలికలకు శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బదిరీ నారాయణ, ఉపాధ్యాయులు, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గగుడి క్యూలో భక్తుడికి పాముకాటు

విజయవాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి విచ్చేసి ఉచిత క్యూలో నిలబడి ఉన్న బాపట్ల జిల్లాకు చెందిన యువకుడిని (25)ని పాము కాటు వేసిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. రేపల్లెకు చెందిన శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి దర్శనానికి వచ్చాడు. శ్రీనివాసరావును పాము కాటు వేయటంతో దేవస్థానం అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు శ్రీనివాసరావును పరీక్షించి ఎటువంటి ప్రమాదం లేదని చెప్పటంతో కుటుంబ సభ్యులు, దేవస్థానం సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

డైనింగ్ హాలు, ఆడిటోరియానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న దాత హరిప్రసాద్

కొల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో డైనింగ్ హాలు, ఆడిటోరియం నిర్మాణం నిమిత్తం దాత గుమ్మడి హరిప్రసాద్ బుధవారం స్థల పరిశీలన చేశారు. కొల్లూరులో 1965లో సీనియర్ సినీ నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు తాను విద్యాబుద్దులు నేర్చుకున్న పాఠశాలలో తన పేరిట కళామందిరం నిర్మాణం చేయించి మరో సీనియర్ నటుడు చిత్తూరు నాగయ్యతో ప్రారంభం చేయించారు. ఆ కళామందిర్ నేడు శిథిలావస్థకు చేరడంతో ఈ విషయాన్ని గ్రామానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ గుమ్మడి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. స్పందించిన కుటుంబ సభ్యులు తమ తండ్రి పేరిట శిథిలావస్థకు చేరిన కళా మందిర్‌ను తొలగించి ఆయన పేరుతో బాలికోన్నత పాఠశాలలో డైనింగ్ హాలు, ఆడిటోరియం నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు బుధవారం గుమ్మడి రెండవ కుమారుడు హరిప్రసాద్ డైనింగ్ హాలు ఆడిటోరియం నిర్మాణానికి సంబంధించిన స్థల పరిశీలన కోసం ఇంజనీర్‌ను వెంట తీసుకుని పాఠశాలలో స్థలాన్ని పరిశీలించారు. ఆయా నిర్మాణాలకు అయ్యే పూర్తి ఖర్చును గుమ్మడి కుటుంబ సభ్యులంతా భరిస్తామని మైనేనికి, పాఠశాల హెచ్ఎం ధనలక్ష్మికి తెలియజేశారు.

రామచంద్రరావుకి కమిషనర్‌గా పదోన్నతి

రేపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పురపాలకసంఘంలో విధులు నిర్వహిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో తెనాలి, చిలకలూరిపేట, వినుకొండలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించామని తెలిపారు. పదోన్నతి పొందటంతో పలువురు అధికారులు అభినందించారు.

నాగులచవితికి ఏర్పాట్లు

చెరుకుపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూడవల్లిలో బాడవదగ్గర ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 25వ తేదీ నాగులచవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు గడ్డిపాటి రామ్మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నాడు వైభోగం నేడు విషాదం!



మంగళగిరి మండలం ఆత్మకూరుకు చెందిన ఒక స్వర్ణకారుడు ముప్పై ఏళ్లుగా స్వర్ణకార వృత్తిలో ఉన్నాడు. చేతినిండా పని ఉండడంతో జేబునిండా సంపాదించాడు. కానీ ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. గడిచిన రెండేళ్లుగా బంగారం ధర పెరగడంతో పనులు తగ్గిపోయాయి. పనులు వస్తాయిలే అన్న నమ్మకంతో అప్పులు చేసేశాడు. తీరా అవి తీర్చడానికి రూ. 70 లక్షల విలువ చేసే ఇంటిని అమ్మేసుకుని రోడ్డున పడ్డాడు. మంగళగిరి పట్టణానికి చెందిన మరో యువకుడు ఆరేళ్ల క్రితం స్వర్ణకార వృత్తిలోకి వచ్చాడు. కొంతకాలం ఫర్వాలేదనిపించింది. గత రెండేళ్లుగా పని లేకుండా పోయింది. ఆరు నెలలపాటు పని రాలేదు. దీంతో స్విగ్గీ బాయ్‌గా వెళుతున్నాడు. ఇది సగటు స్వర్ణకారుల పరిస్థితి. రెండేళ్లుగా పనులు లేకపోవడంతో సమస్తం కోల్పోయి అత్యంత దుర్భర జీవితాన్ని గడుపుతున్న దుస్థితి.



- బాధల్లో 'బంగారు' బతుకులు!
- రెడీమేడ్, మాల్స్ రాకతో పనులపై ప్రభావం
- ధర కొండెక్కడంతో పరిస్థితి తలకిందులు
- రోడ్డుపాలవుతున్న స్వర్ణకారుల కుటుంబాలు
- స్విగ్గీ, డెలవరీబాయ్‌లుగా వెళుతున్న దుస్థితి
- 15,000 కుటుంబాలపై తీవ్ర ప్రభావం

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు స్వర్ణకారుడంటే ఎంతో గొప్ప పేరుండేది. నిన్న మొన్నటి వరకూ కూడా ఆ గొప్పదనం అలాగే కొనసాగింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పోటీపడేలా అత్యంత విలాసవంతమైన జీవితాలు వారివి.

● రెడీమేడ్స్‌తో ప్రభావం

గుంటూరు జిల్లాలో సుమారు 15 వేల కుటుంబాలు స్వర్ణకార వృత్తిపై ఆ ధారపడి ఉన్నాయి. నాలుగు దశాబ్దా లుగా సానుకూల పరిస్థితి ఉండడంతో మంగళగిరి, తెనాలి, చీరాల పరిసర ప్రాంతాల చేనేత కార్మికుల కుటుంబాలన్నీ స్వర్ణకార వృత్తివైపు మొగ్గు చూపాయి. పదేళ్ల క్రితం వరకూ పరిస్థితి బాగానే ఉంది. తొలినాళ్లలో స్వర్ణకారుల స్వర్ణయుగం నడిచింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో సమానంగా ఆదాయాన్ని గడించారు. సొంత ఇళ్లుకూడా నేతకారుల కుటుంబాలు భారీ ఇళ్లను కూడా కట్టుకున్నారు. అత్యంత విలాసవంతమైన జీవితం గడిపారు. దాదాపు 20ఏళ్ల క్రితం బెంగాల్ నుంచి స్వర్ణకారుల వలసలు మొదలయ్యాయి. దీంతో స్థానిక స్వర్ణకారుల పనులపై ప్రభావం పడింది. మెల్లగా పనులు తగ్గడం మొదలయింది. దీనికితోడు ఇటీవల కాలంలో రెడీమేడ్ స్వర్ణాభరణాల తయారీ విపరీతంగా పెరిగింది. భారీ షాపింగ్ మాల్స్ కూడా ఈ రంగంలోకి ప్రవే శించాయి. ఆకర్షణీయమైన ప్రకటనలు, రాయితీలతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. దీంతో వారంతా పనులు చేయించుకోవడం మానేశారు. ఫలితంగా గత దశాబ్దకాలంగా పనులు లేక స్వర్ణకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక వేళ పనులు ఉన్నా తరుగు రూపంలో తీసుకునే ఆదాయం భారీగా పడిపోయింది. గతంలో 5శాతం తరుగుకింద తీసుకుంటుండగా, ఇప్పుడు 3 శాతం కూడా రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో వారి ఆదాయానికి భారీ గండి పడింది.

అప్పట్లో వారి నెలసరి ఆదాయం ఐదంకెల సంఖ్యనుదాటి ఆరెంకెల వరకూ ఉండేది. బంగారపు పనిలో నైపుణ్యం వస్తే చాలు కోట్లు సంపాదించవచ్చు అన్నంతగా ఆ ఒరవడి కొనసాగింది. ఫలితంగా మంగళగిరి పరిసర ప్రాంతాల్లో ప్రతి చేనేత కుటుంబం నుంచి స్వర్ణ కళాకారులు తయారయ్యారు. విజయవాడ, మంగళగిరి, తెనాలి, చీరాల పరిసర ప్రాంతాలు కేంద్రంగా ఈ స్వర్ణకార సమూహం రాష్ట్రంలోనే కాదు.. దేశంలోని అన్ని మార్కెట్లను సొంతం చేసుకుంది. అంతటి వైభోగాన్ని అనుభవించిన స్వర్ణకారులు నేడు కడు దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

మూలిగే నక్కపై తాటిపండులా ధరల పెరుగుదల

రెండేళ్లుగా బంగారం ధర కనీవినీ ఎరుగనీ రీతిలో పెరుగుతోంది. రెండేళ్ల క్రితం గ్రాము బంగారం ధర రూ.5వేలు ఉండగా అది ఇప్పుడు రూ.13వేలకు చే రింది. అంటే దాదాపు 160 శాతం ధర పెరిగింది. దీంతో



సామాన్యులెవరూ బంగారం వైపు చూడడం లేదు. ధరల్లో అస్థిరత కారణంగా రేటు తగ్గుతుందేమో వేచి చూద్దాం అనే పరిస్థితి ఏర్పడింది. దీంతో స్వర్ణకారులకు పని తగ్గింది. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు కూడా స్వర్ణాభరణాల వైపు మొగ్గు చూపడంలేదు. ఒకవేళ తప్పని పరిస్థితుల్లో అవసరమైనా రెడీమేడ్ వైపు వెళుతున్నారు. అందువల్ల స్వర్ణకారులకు పనులే లేని పరిస్థితి నెలకొంది. దీంతో యువకులుగా ఉన్న స్వర్ణకారులు స్విగ్గీ, జొమేటో డెలివరీ బాయ్‌లుగా, ఫ్లిప్‌కార్టు, అమెజాన్, రేపిడో వంటి పనులకు వెళుతున్నారు. మరికొందరు నిర్మాణ కూలీలుగా మారుతున్నారు. అధిక ఆదాయాల వల్ల గతంలో విలాసవంతమైన జీవితాలకు అలవాటుపడినవారు చాలా మంది ఆ ఆదాయం కోసం బెట్టింగ్, ఆన్‌లైన్ రమ్మీ వంటి వాటి మోజులో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. తెనాలికి చెందిన ఓ యువకుడు ఆరేళ్లు కష్టపడి స్వర్ణకార పనినేర్చుకున్నాడు. కానీ చేసేందుకు పనిలేకపోవడంతో కర్రీస్ పాయింట్ పెట్టుకున్నాడు. అదీ సరిగ్గా నడవలేదు. దీంతో బెట్టింగ్ బాట పట్టాడు. ప్రస్తుతం రూ. పది లక్షల అప్పుల్లో కూరుకుపోయాడు. ఆర్థికంగా స్థిరపడిపోయాం అనుకునేవారు కూడా వారికున్న ఇళ్లను, స్థలాలను అమ్ముకొని వీధిన పడే పరిస్థితి నెలకొంది. స్వర్ణకారుల స్థితిగతులపై ప్రభుత్వం దృష్టి సారించకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.



పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ఆదర్శం

ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని, అందుకు చంద్రబాబుపై ఉన్న నమ్మకం, విశ్వసనీయత, నిబద్ధతలే కారణమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సొలసలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో కలసి రూ.40లక్షలతో నిర్మించిన కల్వర్టు, పాఠశాల ప్రహరీ, సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి అండర్-14, అండర్-17 వాలీబాల్ పోటీలు, జిల్లా జట్ల ఎంపికల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ విద్యాభ్యాసం పూర్తిచేసుకున్న ప్రతి విద్యార్థి కోసం ఉద్యోగాలు ఎదురు చూసేలా సీఎం చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేశ్ రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు అవిశ్రాంత కృషి చేస్తున్నారన్నారు. పేద, రైతు కుటుంబాల నుంచి వచ్చిన ప్రతి విద్యార్థికి ఉన్నత భవిష్యత్తు అందించాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. విద్యార్థులు, యువత గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. జీవితంలో రాణించాలంటే విద్యార్థులు పరిణతితో ఆలోచించాలన్నారు. పెట్టుబడుల ఆకర్షించి పరిశ్రమలు పెట్టేలా ప్రోత్సహిస్తోంది రాష్ట్రంలోని యువత ఉపాధి, ఉద్యోగావకాశాల కోసమేనన్నారు. ఈ సందర్భంగా 2024-25 పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తొలి మూడు స్థానాలు సాధించిన పాఠశాల విద్యార్థులకు రంగనాయక ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4వేలు నగదు బహుమతులను అతిథులు ప్రదానం చేశారు. టీడీపీ నాయకులు వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సాయిబాబు, రఘురామారావు, రత్తయ్య, సుబ్బారావు, మండల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

అమరేశ్వరాలయంలో కార్తీక మాస పూజలు

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) పంచారామ పుణ్య క్షేత్రాల్లో ప్రసిద్ధమైన బాల చాముం డికా సమేత అమరేశ్వరాలయంలో కార్తీక మాస సందడి ప్రారంభ మైంది. బుధవారం భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్య స్నానమా చరించి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగిం చారు. స్వామివార్లను దర్శించిన భక్తులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఉసిరి చెట్టు కింద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఎన్‌టీఆర్ వైద్య సేవలు బంద్

(5వ పేజీ తరువాయి)

సాధన కోసం నిర్వాహకులు ఉద్యమిస్తు న్నారు. ప్రభుత్వం బకాయి విషయంలో స్పందించకపోవడంతో ఆందోళనను ఉధృతం చేశా రు. ఇప్పటికే జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఐఎంఏ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహిం చారు. తమ గోడును ప్రభుత్వానికి తెలియజేసేందుకు.. చలో విజయవాడకు పిలుపు నిచ్చారు. గురువారం విజయవాడ వేదికగా నెట్ వర్క్ ఆస్పత్రుల నిర్వాహకులు, వైద్యులు, వైద్య సిబ్బంది ధర్నా నిర్వహించనున్నారు.

పేరుకుపోయిన బకాయి..

బకాయిలు పేరుకుపోవడంతో.. నెలవారి ఖర్చులు రాక వైద్య సిబ్బందిని కుదించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆసుపత్రుల నిర్వాహకులు చెబుతున్నారు. ప్రభుత్వ వ్యవహారంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది భవిష్యత్తు, ఉపాధి ప్రశ్నార్థకంగా మారనుంది. ఇప్పటికే కొన్ని ఆస్పత్రుల్లో సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తుండటం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత వైద్యం తాలూక రూ.2,750 కోట్ల బకాయి చెల్లించాలని నెట్‌వర్క్ ఆస్పత్రుల యూనియన్ నేత డాక్టర్ నాగోతు ప్రకాష్ తెలిపారు. ఉచిత వైద్య సేవల ప్యాకేజీను 2009లో కొంత మేర పెంచారు. ఆ తదుపరి ఇప్పటి వరకు వైద్య ప్యాకేజ్ పెంచలేదు. కొత్తగా ప్రతి పౌరుడిగా వైద్య బీమా పథకం అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో నెట్‌వర్క్ ఆస్పత్రుల డాక్టర్ల కొందరిని పథకం అమలులో భాగస్వాములను చేయాలని, ప్యాకేజ్‌లను పెంచే విషయంలో వైద్యులతో చర్చలు జరపాలని కోరారు. బకాయి విడుదల చేసే వరకు బందు కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉచిత వైద్యం బిల్లులను వెంటనే విడుదల చేయాలని డాక్టర్ ప్రకాష్ కోరారు.

అట్టహాసంగా శ్రీభ్రమర వార్షికోత్సవం

● సరికొత్త ఆలోచనతో పనిచేస్తామన్న సీఎండీ గల్లా రామచంద్రరావు

గుంటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగంలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న శ్రీ భ్రమర గ్రూప్ సంస్థ పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవాలు గుంటూరులోని ఏఎస్ కన్వెన్షన్‌లో బుధవారం అట్టహాసంగా జరిగాయి. నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలన్న ఆశయంతో 2015 అక్టోబరు 22న స్థాపించిన శ్రీభ్రమర 10 ఏళ్ళ విశ్వసనీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకొని ట్రస్ట్ ఎడికేడ్‌గా నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆలోచనలతో ప్రేరణ పొంది, గ్రామాల్లోనూ నగర సౌకర్యాలు అందించాలన్న లక్ష్యంతో శ్రీ భ్రమర సంస్థ స్థాపించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు గుంటూరు, కృష్ణా, ఎన్‌టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 36కి పైగా అత్యద్భుమైన రియల్ ఎస్టేట్ ప్రాజక్టులు విజయవంతంగా పూర్తి చేసి, 12వేలకు పైగా కుటుంబాల సొంతంటి కలను సాకారం చేసిందన్నారు. ఈ సుస్థిర ప్రస్థానం శ్రీ భ్రమర గ్రూప్‌ను ఏపీ రియల్ ఎస్టేట్ రంగంలో విశ్వసనీయ బ్రాండ్‌గా నిలబెట్టిందని తెలిపారు. వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంలో కేవలం సంవత్సరాలనే కాదు ప్రతి కస్టమర్ నమ్మకాన్ని, ప్రతి ఉద్యోగి కష్టాన్ని, ప్రతి మార్కెటింగ్‌మిత్రుడి అంకిత భావాన్ని గుర్తుచేసుకుంటున్నామన్నారు. ఈ దశాబ్ధ ప్రయాణం గొప్ప అనుభవం, గర్వకారణం, ముందున్న రోజుల్లో మరింత ఆలోచనలు, నాణ్యత, విశ్వసనీయతతో ప్రజల నమ్మకానికి తగ్గట్టు పనిచేస్తామన్నారు. వార్షికోత్సవ వేడుకలను పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, సీఎండీ గల్లా రామచంద్రరావు ప్రారంభించగా, కార్యక్రమంలో సంస్థ డైరక్టర్‌లు మారం చంద్రశేఖర్, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ, కల్వకుంట సాయిశంకర్, చెన్నంశెట్టి సతీష్ తదితరులున్నారు.



వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి, శ్రీ భ్రమర సీఎండీ రామచంద్రరావు



ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు

హైస్పీడ్.. సిద్ధం

(5వ పేజీ తరువాయి)

మధ్య నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం రెండు ఎలైన్‌మెంట్లను ప్రతిపాదించింది. అయితే ఈ రెండింటిలో దాచేపల్లి మీదగానే అనువుగా ఉంటుందని ప్రతిపాదించింది. ఆప్షన్-1గా హైదరాబాద్ - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ వే అండ్ తిరుపతి ఎయిర్‌పోర్టు కాగా ఆప్షన్-2ని ఎన్‌హెచ్-65 వెంట గ్రీన్ ఫీల్డ్ ఏరియాలో నుంచి ప్రతిపాదన చేసింది. ఎలైన్‌మెంట్ ఖరారు చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని కోరింది. స్టేషన్లు నిర్మించాల్సిన ప్రదేశాల వద్ద 50 ఎకరాల చొప్పున భూమి అవసరం అవుతుంది. 30 నుంచి 40 ఏళ్ల అవుట్‌లుక్‌తో రాష్ట్ర దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల బ్లూప్రింట్‌లో దీనిని చేర్చాలి. నిర్ణీత గడువు తేదీ లోపు ఫైనల్ లోకేషన్ సర్వే చేయనున్నందున ఎలాంటి జాప్యం లేకుండా సహకారం అందించాలని కోరింది.

మూడు జిల్లాల్లో భూసేకరణ..

- పల్నాడు జిల్లాలో 81 కిలోమీటర్ల పొడవునా ఈ హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ నిర్మాణం జరగనున్నది. 7.130 కిలోమీటర్లు అటవీ భూమి కూడా ఉన్నది. దీంతో మొత్తంగా 243 హెక్టార్ల భూమి అవసరం అవుతుంది.
- గుంటూరు జిల్లాలో 66.45 కిలోమీటర్ల పొడవునా నిర్మాణం జరగనున్నది. ప్రాజెక్టు కోసం 199.35 హెక్టార్ల ప్రభుత్వ/ప్రైవేటు భూమి అవసరం ఏర్పడుతుంది.
- బాపట్ల జిల్లాలో 43.21 కిలోమటర్ల పొడవునా రైలు మార్గం నిర్మాణం జరగనున్నది. 129.63 హెక్టార్ల భూమి అవసరం అవుతుంది.

మారిపోనున్న ముఖచిత్రాలు

హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ముఖచిత్రాలే మారిపోతాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా వేల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పారిశ్రామిక ప్రగతికి ఈ ప్రాజెక్టు బాటలు వేయనున్నది. అటు చెన్నై, ఇటు హైదరాబాద్ మధ్య అమరావతి రాజధానులు అనుసంధానం అవుతాయి. శంషాబాద్, తిరుపతి, చెన్నై ఎయిర్‌పోర్టులకు సులభతరంగా చేరుకునేందుకు కనెక్టివిటీ లభిస్తుంది. హెచ్‌ఎస్‌ఆర్ స్టేషన్ల వద్ద 50 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్నందున అక్కడ వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతాయి.

నేటి నుంచి బిలియర్డ్స్ టోర్నీ

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఎల్‌వీఆర్ క్లబ్‌లో గురువారం నుంచి ఏపీ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ ర్యాంకింగ్ పురుషుల టోర్నమెంట్ ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వస్తున్న క్రీడాకారులతో ఎల్వీఆర్ క్లబ్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ పోటీల నిర్వహణతో క్లబ్బు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని పోటీల నిర్వహణ కార్యదర్శి పులివర్తి వెంకటేశ్వర రావు (అజార్) అన్నారు. బిలియర్డ్స్‌కు 38 ఎంట్రీలు, స్నూకర్స్‌కు 215 ఎంట్రీలు నమోదయ్యాయని తెలిపారు. క్లబ్బుకు చెందిన ఎస్.శంకర్రావు, ఎం.శ్రీనివాసరావు పోటీల్లో తలపడుతున్నారని చెప్పారు. పోటీల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా క్లబ్బు కార్యదర్శి యాగంటి దుర్గారావు, అధ్యక్షులు మైనేని బ్రహ్మేశ్వరరావు, ఉపాధ్యక్షులు వణుకూరి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి ఏల్చూరి వెంకటేశ్వర్లు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఏపీ బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్ సంఘం ప్రతినిధులు పోటీలకు సాంకేతిక సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. పోటీలకు విచ్చేసిన క్రీడాకారులకు ఉచిత భోజన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోటీల విజేతలకు 1.35 లక్షల ప్రైజ్ మనీ అందజేస్తామని వెల్లడించారు. ఈ పోటీలను గురువారం ఉదయం 9 గంటలకు శాప్ ఛైర్మన్ ఎ.రవి నాయుడు ప్రారంభిస్తారని అజార్ తెలిపారు.



బిలియర్డ్స్ టేబుల్‌పై సాధన చేస్తున్న క్రీడాకారుడు



మూడు జిల్లాల విద్యాశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, సీఈవో జ్యోతి బసు

స్టడీ మెటీరియల్ సమాచారం అందజేయాలి

గుంటూరు సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా 10వ తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ నుంచి అందజేసే స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సమాచారాన్ని ఈ నెలాఖరులోగా అందజేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయ చాంబర్లో బుధవారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల విద్యాశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ, స్టడీ మెటీరియల్ గత సంవత్సరం ఎంతమందికి పంపిణీ చేశారు, ఈ ఏడాది ఎంతమందికి పంపిణీ చేస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సమాచారాన్ని త్వరగా అందజేస్తే ముద్రించి డిసెంబరు నాటికల్లా పాఠశాలలకు అందజేస్తామని వెల్లడించారు. అదే విధంగా పాఠశాలల్లో న్యూట్రిషన్ వసతులు, సిలబస్ గురించి అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం జిల్లా పరిషత్తు నుంచి పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు. తత్ఫలితంగా పల్నాడు జిల్లా విద్యార్థిని అత్యధికంగా 598 మార్కులు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇతర జిల్లాల నుంచి కూడా స్టడీ మెటీరియల్ ఇవ్వాలని కోరినట్టు జడ్పీ చైర్‌పర్సన్ వెల్లడించారు. కార్యక్రమంలో సీఈవో జ్యోతి బసు, గుంటూరు డీఈవో రేణుక, బాపట్ల, పల్నాడు జిల్లాల విద్యాశాఖ అధికారులు అవుల తిరుమలరావు, కె.ప్రభాకర్ రావు, కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

ముసురు.. ముంపు

(5వ పేజీ తరువాయి)

రేపల్లె, బాపట్ల ప్రాంతాల్లో వర్షం ప్రభావం ఎక్కువగానే చూపింది. పల్నాడు జిల్లాలోనూ వర్ష ప్రభావంతో వాణిజ్య పంటలకు నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మరో నాలుగు రోజులు..

మరో నాలుగు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గురు, శుక్రవారాల్లో అల్పపీడనం వాయుగుండంగా మారితే గాలుల తీవ్రత పెరుగుతుందన్నారు. 30నుంచి 70 సెంటీమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది.

జిల్లాలో మూడురోజులు భారీవర్షాలు

బాపట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో 08643 -220226 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన తక్షణమే సంప్రదించవచ్చన్నారు.

ఫార్మసీ పరీక్ష ఫలితాలు...

ఏఎన్‌యూ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏప్రిల్‌లో జరిగిన ఫార్మసీ రివాల్యూషన్ పరీక్ష ఫలితాలను బుధవారం పరీక్షల నియంత్రణ అధికారి శివప్రసాద్ విడుదల చేశారు. జూలైలో జరిగిన నానో టెక్నాలజీ సెమిస్టర్ ఫలితాలను కూడా విడుదల చేశారు. వచ్చే నెల 3లోగా రూ.1860 చెల్లించి రివాల్యూషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పొగాకు సమాఖ్య పీఐసీ చైర్మన్‌గా జయంతిబాబు

ఒంగోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య (పొగాకు సమాఖ్య) పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్మన్‌గా సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత మండవ జయంత్‌బాబు నియమితులయ్యారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పొగాకు పండించే రైతులు వేలాది మంది సభ్యులుగా ఉండే పొగాకు సమాఖ్య ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగి ఉంది. ప్రస్తుతం అంతటి పరిస్థితి లేకపోయినా పొగాకు అధికంగా పండే ఈ ప్రాంతంలో ఆ సంస్థకు ప్రత్యేక గుర్తింపు ఉండగా ఒంగోలు కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కాగా ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక నామినేటెడ్ పదవుల భర్తీలో పార్టీలో క్రియాశీలకంగా వివిధ నియోజకవర్గాల్లో పనిచేసిన నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈక్రమంలో రైతాంగంలో గుర్తింపు ఉన్న పొగాకు సమాఖ్య పీఐసీ కమిటీని నియమిస్తూ బుధవారం ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. ముగ్గురు సభ్యులతో కూడిన ఈ కమిటీ చైర్మన్‌గా మద్దిపాడు మండలం బసవన్నపాలెంకు చెందిన మండవ జయంత్‌బాబును నియమించగా సభ్యులుగా ఎన్‌జీపాడుకు చెందిన మాచవరపు జాన్, ఒంగోలు నగరపరిధిలోని త్రోవగుంటకు చెందిన కోమటినేని వీరభద్రరావులను నియమించారు. ఆ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు ఇచ్చారు. యువకుడైన జయంత్‌బాబు ఎస్‌ఎన్‌పాడు నియోజకవర్గంలో పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. మూడు పర్యాయాలు మద్దిపాడు మండల టీడీపీ అధ్యక్షుడుగా ఉన్న జయంత్‌బాబు పార్టీ అధికారం కోల్పోయి తీవ్ర ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్న సమయంలోనూ నిబద్ధతతో పనిచేశారు. తన నియామకానికి సహకరించిన ఎస్‌ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్, మంత్రి డాక్టర్ స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఇతర నేతలకు జయంత్‌బాబు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

డీఆర్సీ సమావేశం వాయిదా

ఒంగోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్షా మండలి(డీఆర్సీ) సమావేశం వాయిదాపడింది. పలు కీలక అంశాలపై సమీక్ష కోసం ఈనెల 24న డీఆర్సీ సమావేశం ఏర్పాటుకు జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. జిల్లాలో డీఆర్సీ సభ్యులుగా ఉన్న ఎమ్మెల్యేలు ఇతర కీలక ప్రజాప్రతినిధులకు కూడా 24వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఒంగోలులోని ప్రకాశం భవనంలోని సమావేశపు హాలులో సమావేశం ఉంటుందని సమాచారం కూడా పంపారు. అయితే తాజాగా నెలకొన్న వాతావరణ పరిస్థితులతో వాయుగుండం ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో వారంరోజుల పాటు ఇలాంటి పరిస్థితులే ఉండే అవకాశం కనిపిస్తుంది. ఇదే సమయంలో కార్తీక మాసం కావడంతో వివాహాలు, శుభకార్యాలు అధికంగా ఉన్నాయి. ఒక్కొక్క ఎమ్మెల్యే రోజుకు ఇలాంటివి ఐదారు కార్యక్రమాలకు హాజరు కావాల్సిన ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో 24న జరగాల్సిన డీఆర్సీ సమావేశాన్ని వాయిదా వేసి మరోసారి నిర్వహించాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరిన నేపథ్యంలో తాత్కాలికంగా సమావేశాన్ని వాయిదా వేయాలని ఇన్‌చార్జ్ మంత్రి అధికారులకు సూచించినట్లు సమాచారం. తిరిగి వచ్చే నెల తొలివారంలో జరిగే అవకాశం ఉంది.

అధికారి వేధింపులకు మహిళా ఉద్యోగి బలి

దర్శి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దర్శి ఏడీఏ కార్యాలయంలో అధికారి వేధింపులకు మహిళా ఉద్యోగి బలైంది. ఆ అధికారి పెడుతున్న ఇబ్బందులు తట్టుకోలేక 20రోజుల క్రితం పురుగుల మందు తాగిన ఆమె చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందింది. దీంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కాగా పోలీసులు ఆమె మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కేసు నమోదు చేశారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో టి.రమణ అనే మహిళా ఉద్యోగి అటెండర్‌గా పనిచేస్తోంది. ఆమె భర్త సుబ్బరాయుడు గతంలో వ్యవసాయాధికారిగా పనిచేశారు. ఆయన కరోనాతో మృతిచెందటంతో కారుణ్య నియామకం కింద ప్రభుత్వం ఆయన భార్యకు అటెండర్ ఉద్యోగం ఇచ్చింది. అప్పటి నుంచి ఆమె ఏడీఏ కార్యాలయంలో పనిచేస్తోంది. గతనెల 29వ తేదీన ఆమె హఠాత్తుగా పురుగు మందు తాగింది. ఆ సమయంలో ఆమె ఎందుకు ఆత్మహత్యకు పాల్పడిందనే విషయం తెలియలేదు. ఒంగోలులో చికిత్స పొందుతూ మంగళవారం ఆమె మృతిచెందటంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

ముంపు గ్రామాలపై దృష్టి సారించండి

తోటవారిపాలెంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

చౌకధరల దుకాణంపై అసంతృప్తి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

చీరాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతంలో అధిక వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో ముంపు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ డాక్టరు వినోద్‌కుమార్ చెప్పారు. బుధవారం చీరాల మండల పరిధిలోని తోటవారిపాలెం సచివాలయ పరిధిలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణతో కలిసి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈక్రమంలో ముందుగా గ్రామంలోని చౌక ధరల దుకాణంను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పైకప్పు సరిగ్గా లేనందున రేషన్ సరుకు తడిచే అవకాశం ఉందని కలెక్టర్ చెప్పారు. వెంటనే నిర్వహణ ప్రదేశాన్ని మార్చాలని సూచించారు. అంతేకాకుండా వాడరేవు - చిలకలూరిపేట 167 ఏ జాతీయ రహదారి నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో అధికారులకు సూచించారు. జిల్లా పరిధిలో 92.12 హెక్టార్లకు గాను 89.52 హెక్టార్లలో 3డీ(భూమి సేకరణ సమస్యలకు పరిష్కారం)పూర్తయినట్లు వివరించారు. 2.6 హెక్టార్లు 3డీ పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. వాటిని మరో వారంలో పూర్తిచేయాలని సూచించారు. అలాగే జాతీయ రహదారికి సంబంధించి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట పలువురు అధికారులు ఉన్నారు.

దీక్ష ధారులకు అన్నదానం ప్రారంభం



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న భక్తులు

చినగంజాం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోపిరాల గ్రామంలోని లలితాపరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానంలో దీక్షాధారులకు అన్నదాన(సద్ది) కార్యక్రమాన్ని దేవస్థాన కమిటీ చైర్మన్ డాక్టర్ టీఎస్‌ఆర్ ఆంజనేయులు దంపతులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంగణంలోని హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయంలో అర్చకులు శంకర్‌మిశ్రా, గురుస్వాములు నరహరి హనుమంతరావు, చెరుకూరి రాఘవయ్యల ఆధ్వర్యంలో స్వామికి పడిపూజ చేశారు. అయ్యప్ప, శివ, భవానీ, ఆంజనేయ, వెంకటేశ్వర తదితర దీక్షాధారులకు బుధవారం నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు గ్రామస్థులు, గ్రామానికి చెందిన 1994-95 పదో తరగతి పూర్వ విద్యార్థుల సహకారంతో డిసెంబరు 11 నుంచి 2026 జనవరి 10వ తేదీ వరకు సద్ది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ చైర్మన్ తెలిపారు. అయ్యప్పస్వామి దేవస్థానం ఎదురు ముఖ మండపం, గేట్లు ఏర్పాటుకు, మూలికా పురత్తమ్మ అమ్మవారి ఆలయ ముఖ మండపం నిర్మాణ పనులకు ఆలయ కమిటీ చైర్మన్ భూమి పూజ చేశారు. దేవస్థానం ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య స్వామికి కుర్రి సుబ్బారావు భార్య సీతామహాలక్ష్మి, కుమార్తె సుభాషిణిల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు వెండి వేళా ఆయుధాన్ని బహూకరించారు.

కార్తీక మాసం ప్రారంభం పూజలు

అద్దంకి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం ప్రారంభం రోజు పెద్ద సంఖ్యలో భక్తులు దీక్షధారణ చేశారు. బుధవారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కావటంతో భక్తులు శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. మణికేశ్వరంలోని మల్లేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి దీక్షలు చేపట్టారు. పూజారి నడింపల్లి లక్ష్మీనారాయణ ఈ క్రతువు పూర్తి చేశారు. పట్టణంలోని పాత శివాలయం, వేయిస్తంభాల గుడి, కమతేశ్వరస్వామి దేవాలయంలో పూజలు జరిగాయి.

దీక్ష ధారులకు అన్నదానం ప్రారంభం

అద్దంకి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని వేయిస్తంభాల గుడిలో దీక్ష ధారులకు బుధవారం నుంచి అన్నదానం ప్రారంభమైంది. 48 రోజులపాటు రోజూ మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని నిర్వహణ కమిటీ బాధ్యులు మురగొండ ధనుంజయ తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారి కంఠంరాజు సత్యనారాయణ శర్మ, మానికొండ నాగరాజు పాల్గొన్నారు.

చినగంజాంలో...

చినగంజాం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : శివకేశవులకు ప్రీతిపాత్రమైన పవిత్ర కార్తీకమాసం సందర్భంగా మండల పరిధిలోని గ్రామాల్లోని శైవక్షేత్రాలలో బుధవారం కార్తీకమాస పూజా కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శైవక్షేత్రాలలో తెల్లవారుజాము నుంచే భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివార్లకు మహన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం, అభిషేకాలు తదితర పూజలను నిర్వహించారు. కొత్తపాలెంలోని పార్వతీ సమేత స్వయంభూ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలోని ధ్వజస్తంభం వద్ద ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, అయ్యప్ప, శివమాలధారణస్వాములు, మహిళా భక్తులు విశేష పూజలు నిర్వహించి ఆకాశదీపాన్ని ఏర్పాటు చేశారు.



పెద్ద సంఖ్యలో దీక్షలు తీసుకున్న భక్తులు

ముసురు.. ముంపు

(5వ పేజీ తరువాయి)

రేపల్లె, బాపట్ల ప్రాంతాల్లో వర్షం ప్రభావం ఎక్కువగానే చూపింది. పల్నాడు జిల్లాలోనూ వర్ష ప్రభావంతో వాణిజ్య పంటలకు నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మరో నాలుగు రోజులు..

మరో నాలుగు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గురు, శుక్రవారాల్లో అల్పపీడనం వాయుగుండంగా మారితే గాలుల తీవ్రత పెరుగుతుందన్నారు. 30 నుంచి 70 సెంటీమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు చేసింది.

జిల్లాలో మూడురోజులు భారీవర్షాలు

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బాపట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మూడు రోజులు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో 08643-220226 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన తక్షణమే సంప్రదించవచ్చన్నారు.

మార్కాపురం జిల్లాపై ముందడుగు

అద్దంకి, కందుకూరు ఒంగోలులోకి..

తదనుగుణంగా జిల్లాల కలెక్టర్లతో సీసీఎల్‌ఏ ఉన్నతాధికారుల సమీక్ష

నివేదికలు ఇవ్వాలని ఆదేశం

జనవరికే కొత్త జిల్లాలు వచ్చే అవకాశం?

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చటంలో దూకుడుగా ఉన్న రాష్ట్రప్రభుత్వం జిల్లాల పునర్విభజనకు మరో ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో బుధవారం ఉన్నతాధికారులు రంగంలోకి వచ్చి కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. మార్కాపురం జిల్లా ఏర్పాటుకు సంబంధించి ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబుకు కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలిపేందుకు అవసరమైన నివేదికను ఇవ్వాలని, నెల్లూరు, బాపట్ల కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. దీంతో వచ్చే జనవరి నాటికే మార్కాపురం జిల్లా ఏర్పాటుతో పాటు ఒంగోలు కేంద్రంగా కొనసాగే ప్రకాశం జిల్లాలోకి అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను కలిపే అవకాశం ఉంది. బుధవారం కలెక్టర్లు, జేసీలు, ఇతర ముఖ్య రెవెన్యూ అధికారులతో సీసీఎల్‌ఏ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయమై స్పష్టమైన ఆదేశాలు ఇస్తూ ఆయా అంశాలపై సమీక్ష చేశారు.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత వైసీపీ ప్రభుత్వం ప్రజలు ఆశలు, ఆకాంక్షలను పక్కనపెట్టి జిల్లాల పునర్విభజన చేసింది. రాష్ట్రంలోని 13 జిల్లాలు 26 జిల్లాలుగా పెరిగాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా మూడు జిల్లాలోకి విభజించారు. ఆ సందర్భంగా ప్రజలు వివిధ రకాల అంశాలను లేవనెత్తారు. బాపట్ల జిల్లాలో కలిసిన అద్దంకి, నెల్లూరు జిల్లాలో కలిసిన కందుకూరు నియోజకవర్గా లకు చెందిన ప్రజలు, ప్రజాప్రతినిదులు, ప్రజాసంఘాల వారు తమను ప్రకాశం జిల్లాలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. పశ్చిమ ప్రాంత ప్రజానీకం మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని మొత్తుకున్నారు. ఈ రెండు అంశాలకు అప్పటి ప్రతిపక్ష పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ మద్దతుగా నిలవగా, అప్పటి అధికారపార్టీ అయిన వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు కూడా ప్రజల ఆకాంక్షలు సబబు అని భావించారు. అయితే అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఇవేమి పట్టించుకోకుండా తాను అనుకున్న ప్రకారం కొత్త జిల్లాల కార్యక్రమం ముగించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా యువగళం పాదయాత్ర సందర్భంగా జిల్లాకు వచ్చిన సందర్భంలో ప్రస్తుత మంత్రి నారా లోకేష్ కందుకూరు నియోజకవర్గంలో పర్యటిస్తూ కందుకూరును ప్రకాశం జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. పశ్చిమ ప్రాంతంలో పర్యటిస్తూ మార్కాపురం జిల్లా ఏర్పాటుపై స్పష్టత ఇచ్చారు. అద్దంకిలో పర్యటించేటప్పుడు అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ, ఆర్డీవో ఓబులేశ్

చెప్పిన విధంగానే చర్యలు

ప్రతిపక్ష నేత హోదాలో పశ్చిమ ప్రాంతానికి వచ్చిన చంద్రబాబునాయుడు మార్కాపురం, గిద్దలూరులో జరిగిన సభల్లో తాము అధికారంలోకి వస్తే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కందుకూరు, అద్దంకిలను ఒంగోలులో చేరుస్తామని స్పష్టంగా చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గిద్దలూరు వచ్చినపుడు జనసేన అధినేత, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కూడా మార్కాపురం జిల్లా ఏర్పాటుపై హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది అనంతరం ఆ విషయంపై దృష్టి పెట్టి జిల్లాల పునర్విభజనపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశారు. ఆ ఉపసంఘం వివిధ రూపాల్లో సమాచారం సేకరించి ఒక నివేదికను రూపొందించింది. అందులో ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి సంబంధించి మార్కాపురం కేంద్రంగా ఆ జిల్లా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటు అద్దంకి అటు కందుకూరులను ప్రకాశం జిల్లాలో కలపాలని కూడా సూచించారు.

ఎప్పుడైనా జరగవచ్చు

ఉన్నతాధికారుల ఆదేశాలను పరిశీలించినా, మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నా వచ్చే జనవరికే జిల్లాల పునర్వ్యస్థీకరణ అంశం కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తోంది. కలెక్టర్లను రెండు, మూడు రోజుల్లోనే నివేదికలు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికేనివేదికలు సిద్ధం చేసింది. వివిధ రకాల సాంకేతిక సమస్యలతో ఈ విషయంలో ప్రభుత్వం వేగంగా స్పందించనుందనే ప్రచారం ఉండనే ఉంది. దీంతో ఈ విషయంపై మంత్రివర్గ ఉపసంఘంలోని మంత్రిని సంప్రదించగా మా పని పూర్తయింది.. ఇప్పుడు యంత్రాంగం పని ప్రారంభమవుతుంది.. వచ్చే జనవరికే కొత్త జిల్లాల ఏర్పాటు జరిగినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.. కానిపక్షంలో వచ్చే ఏడాదిలో ఎప్పుడైనా పూర్తవుతుందని తెలిపారు.



కందుకూరు పట్టణం

కీలక దశ ఆరంభం

కాగా రాజకీయ హామీలు, మంత్రివర్గ ఉపసంఘాలు ఎన్ని నివేదికలు ఇచ్చినా చట్టప్రకారం పని పూర్తిచేయాల్సింది అధికార యంత్రాంగమే. అది ఎప్పుడు జరుగుతుందో అనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయి. ఈ దశలో బుధవారం నాటి పరిణామం ఈ వ్యవహారం తుది దశకు చేరిన సంకేతాన్ని వెల్లడించింది. సీసీఎల్‌ఏ కమిషనర్ లక్ష్మీ, అదనపు కమిషనర్ మురళీ నిర్వహించిన వీసీలో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌లను ప్రస్తావిస్తూ జిల్లాల పునర్వస్థీకరణ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశించారని కలెక్టర్లకు తెలిపారు. ఆ సందర్భంలో ప్రకాశం జిల్లా కలెక్టర్‌ను ఉద్దేశించి మాట్లాడేటప్పుడు మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ప్రస్తావించారు. మార్కాపురంతోపాటు గిద్దలూరు, ఎర్రగొండపాలెం, కనిగిరి, దర్శి అసెంబ్లీ నియోజకవర్గాలను ఆ జిల్లాలో భాగస్వామ్యం చేయాలన్న ఆలోచనను తెలిపారు. తదనుగుణంగా మండలాలు, గ్రామాల వారి పరిస్థితిని సమీక్షించింది. ప్రభుత్వ భూములు, అటవీశాఖ భూములు, ఇతరత్రా అంశాలను పరిగణనలోకి తీసుకోండి. తదనుగుణంగా మార్కాపురం జిల్లా ఏర్పాటుకు సంబంధించి నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీ అలాగే భూపరమైన హద్దులను తెలిపే నివేదికలను పంపాలని ఆదేశించారు. అది రెండు, మూడు రోజుల్లోనే అందాలని ప్రత్యేకంగా ఆదేశించటం విశేషం.

అలాగే అద్దంకి, కందుకూరులను ప్రకాశం జిల్లాలోకి కలపాల్సిన అవసరం ఉందని ఆ రెండు నియోజకవర్గాలు, గ్రామాలు, మండలాల వారి హద్దులు బౌగోళిక సరిహద్దులు గుర్తించి వెంటనే నివేదిక పంపాలని బాపట్ల, నెల్లూరు జిల్లాల కలెక్టర్లను ఉన్నతాధికారులు ఆదేశించారు.

మణికేశ్వరం వచ్చే భక్తుల కోసం రోడ్డుకు మరమ్మతులు

అవీఇవీ



దేవాలయం ముందు చదును చేసే పనులు పర్యవేక్షిస్తున్న టీడీపీ నేతలు

అద్దంకి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : చినకాశీగా ఖ్యాతికెక్కిన మణికేశ్వరం గ్రామంలో రోడ్డుకు బుధవారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. కార్తీక మాసంలో ఆ గ్రామంలోని మల్లేశ్వర స్వామి ఆలయానికి భక్తులు విపరీతంగా వస్తారు. అలాగే ఎక్స్‌కవేటర్‌తో దేవాలయం ముందు ఖాళీ స్థలం చదును చేయించారు. రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు తొలగించాశారు. గోతులను తాత్కాలికంగా పూడ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుంటుపల్లి వాసుబాబు, టీడీపీ నేత షేక్ కరిముల్లా, అశోక్, ఆదినారాయణ, బలరామిరెడ్డి, మౌలాలి, మస్తాన్‌వలి, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ వైద్య సేవలు బంద్!

(5వ పేజీ తరువాయి)

సాధన కోసం నిర్వాహకులు ఉద్యమిస్తున్నారు. ప్రభుత్వం బకాయి విషయంలో స్పందించకపోవడంతో ఆందోళనను ఉధృతం చేశారు. ఇప్పటికే జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఐఎంఏ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహిం చారు. తమ గోడును ప్రభుత్వానికి తెలియజేసేందుకు.. చలో విజయవాడకు పిలుపునిచ్చారు. గురువారం విజయవాడ వేదికగా నెట్ వర్క్ ఆస్పత్రుల నిర్వాహకులు, వైద్యులు, వైద్య సిబ్బంది ధర్నా నిర్వహించనున్నారు.

పేరుకుపోయిన బకాయి..

బకాయిలు పేరుకుపోవడంతో.. నెలవారి ఖర్చులు రాక వైద్య సిబ్బందిని కుదించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆసుపత్రుల నిర్వాహకులు చెబుతున్నారు. ప్రభుత్వ వ్యవహారంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది భవిష్యత్తు, ఉపాధి ప్రశ్నార్థకంగా మారనుంది. ఇప్పటికే కొన్ని ఆస్పత్రుల్లో సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తుండటం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత వైద్యం తాలూక రూ.2,750 కోట్ల బకాయి చెల్లించాలని నెట్‌వర్క్ ఆస్పత్రుల యూనియన్ నేత డాక్టర్ నాగోతు ప్రకాష్ తెలిపారు. ఉచిన వైద్య సేవల ప్యాకేజీను 2009లో కొంత మేర పెంచారు. ఆ తదుపరి ఇప్పటి వరకు వైద్య ప్యాకేజ్ పెంచలేదు. కొత్తగా ప్రతి పౌరుడిగా వైద్య బీమా పథకం అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో నెట్‌వర్క్ ఆస్పత్రుల డాక్టర్ల కొందరిని పథకం అమలులో భాగస్వాములను చేయాలని, ప్యాకేజ్‌లను పెంచే విషయంలో వైద్యులతో చర్చలు జరపాలని కోరారు. బకాయి విడుదల చేసే వరకు బంద్ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉచిత వైద్యం బిల్లులను వెంటనే విడుదల చేయాలని డాక్టర్ ప్రకాష్ కోరారు.

పత్తి కొనుగోలు..ఉత్తిదేనా!

(5వ పేజీ తరువాయి)

ఇప్పటికే పదిరోజులు దాటింది. తాజాగా నిబంధనల సాకు చూపి మొత్తంగానే వైదొలిగే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మళ్లీ దళారులే తమకు దిక్కవుతున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరు వేల ఎకరాల్లో సాగు చేయాలనే మెలిక

జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరవాలంటే కనీసం 6 వేల ఎకరాల్లో పత్తి సాగు జరగడంతో పాటు.. గతంలో జరిపిన సేకరణ కూడా ఆశాజనకంగా ఉండాలనే నిబంధనలను అధికారులు తెరపైకి తెస్తున్నారు. ఈ ఏడాది బాపట్ల జిల్లా వ్యాప్తంగా 4,500 ఎకరాల్లో పత్తి సాగయ్యింది. ఇదంతా పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లోని పది మండలాల పరిధిలోనే ఉన్నట్లు వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి. దాదాపుగా 40 వేల క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. గతేడాది కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు సీసీఐ సేకరించింది జిల్లా వ్యాప్తంగా 13 వేల క్వింటాళ్లుగా ఉంది. నిబంధనల ప్రకారం ఇది చాలా కనిష్ఠమని, ఇదే కాకుండా సాగు విస్తీర్ణం కూడా ప్రతిబంధకంగా మారిందని అధికారులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంపై నవంబరు మొదటి వారంలో స్పష్టత వస్తుందని యంత్రాంగం చెబుతోంది. ఇదిలా ఉంటే జిల్లాలో రెండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని గతంలో మార్కెటింగ్‌శాఖ ప్రకటనను రైతులు గుర్తుచేస్తూ.. ఇప్పుడు నిబంధనల సాకుతో పునరాలోచన చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు

దిగుబడుల్లో భారీ కోత

ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాలు నమోదయ్యాయి. పర్చూరు నియోజకవర్గ పరిధిలో అధికంగా కుండపోత వానలు పలుసార్లు నమోదయ్యాయి. ఈ ప్రభావంతో ఎకరానికి 12 క్వింటాళ్ల వరకు వచ్చే దిగుబడి, ప్రస్తుతం 8 నుంచి 9 క్వింటాళ్లకే పరిమితమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి మద్దతు ధర క్వింటాకు రూ.8,110 ఉండగా, ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.7,200 నుంచి రూ.7,500 వరకు పలుకుతోందని రైతులు చెబుతున్నారు. క్వాలిటీ ఉన్న పత్తికే ఈ ధర చెల్లిస్తున్నారని, లేదంటే రూ.7 వేల దిగువకే అడుగుతున్నారని వాపోతున్నారు.

హైస్పీడ్.. సిద్ధం

(5వ పేజీ తరువాయి)

మధ్య నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం రెండు ఎలైన్‌మెంట్లను ప్రతిపాదించింది. అయితే ఈ రెండింటిలో దాచేపల్లి మీదగానే అనువుగా ఉంటుందని ప్రతిపాదించింది. ఆప్షన్-1గా హైదరాబాద్ - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ వే అండ్ తిరుపతి ఎయిర్‌పోర్టు కాగా ఆప్షన్-2ని ఎన్‌హెచ్-65 వెంట గ్రీన్ ఫీల్డ్ ఏరియాలో నుంచి ప్రతిపాదన చేసింది. ఎలైన్‌మెంట్ ఖరారు చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని కోరింది. స్టేషన్లు నిర్మించాల్సిన ప్రదేశాల వద్ద 50 ఎకరాల చొప్పున భూమి అవసరం అవుతుంది. 30 నుంచి 40 ఏళ్ల అవుట్‌లుక్‌తో రాష్ట్ర దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల బ్లూప్రింట్‌లో దీనిని చేర్చాలి. నిర్దీత గడువు తేదీ లోపు ఫైనల్ లొకేషన్ సర్వే చేయనున్నందున ఎలాంటి జాప్యం లేకుండా సహకారం అందించాలని కోరింది.

మూడు జిల్లాల్లో భూసేకరణ..

- పల్నాడు జిల్లాలో 81 కిలోమీటర్ల పొడవునా ఈ హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ నిర్మాణం జరగనున్నది. 7.130 కిలోమీటర్లు అటవీ భూమి కూడా ఉన్నది. దీంతో మొత్తంగా 243 హెక్టార్ల భూమి అవసరం అవుతుంది.
- గుంటూరు జిల్లాలో 66.45 కిలోమీటర్ల పొడవునా నిర్మాణం జరగనున్నది. ప్రాజెక్టు కోసం 199.35 హెక్టార్ల ప్రభుత్వ/ప్రైవేటు భూమి అవసరం ఏర్పడుతుంది.
- బాపట్ల జిల్లాలో 43.21 కిలోమటర్ల పొడవునా రైలు మార్గం నిర్మాణం జరగనున్నది. 129.63 హెక్టార్ల భూమి అవసరం అవుతుంది.

మారిపోనున్న ముఖచిత్రాలు

హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ముఖచిత్రాలే మారిపోతాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా వేల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పారిశ్రామిక ప్రగతికి ఈ ప్రాజెక్టు బాటలు వేయనున్నది. అటు చెన్నై, ఇటు హైదరాబాద్ మధ్య అమరావతి రాజధానులు అనుసంధానం అవుతాయి. శంషాబాద్, తిరుపతి, చెన్నై ఎయిర్‌పోర్టులకు సులభతరంగా చేరుకునేందుకు కనెక్టివిటీ లభిస్తుంది. హెచ్‌ఎస్‌ఆర్ స్టేషన్ల వద్ద 50 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్నందున అక్కడ వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతాయి.

నేడు కొత్తపేట పంచాయతీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభం

ఓసీ జనరల్‌కు కేటాయింపు

కొత్తపేట(చీరాల), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభం కానుంది. అందుకు సంబంధించిన వివరాలను బుధవారం జిల్లా అసిస్టెంట్ ఎన్నికల అధికారి ఎం రాజేష్‌బాబు వెల్లడించారు. పంచాయతీలో మొత్తం 16 వార్డులు ఉండగా అందులో 5 బీసీ, ఒక ఎస్టీ, ఎస్సీ 2, జనరల్ కేటగరీలో 8 కేటాయించినట్లు పేర్కొన్నారు. మొత్తం 8 పురుషులు, 8 స్థానాలు మహిళలకు కేటాయించామన్నారు. ఆర్వో(రిటర్నింగ్ అధికారి)గా సుబ్బారావు, అసిస్టెంట్ ఆర్వోగా నారాయణను జిల్లా అధికారులు నిర్ణయించారు. ఇదిలా ఉంటే సమయాభావం లేకుండా హఠాత్తుగా ఎన్నికలు రావడంతో ప్రధాన పార్టీలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అసాధారణంగా కనిపిస్తోంది.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

అద్దంకిటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 23వ తేదీ నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటు చేశామని ఎంపీడీవో బి. వరూధిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీన ధర్మవరం, తిమ్మాయపాలెం, మణికేశ్వరం గ్రామాల్లో, 24న శంఖవరప్పాడు, తిమ్మాయపాలెం, కొంగపాడు, 25న శంఖవరప్పాడు, కొటికలపూడి, నాగులపాడు, 26న కలవకూరు, కుంకుపాడు, నాగులపాడు గ్రామాల్లో జరుగుతాయని పేర్కొన్నారు. 27న శింగరకొండపాలెం, గోపాలపురం, వెంకటాపురం, 28న ఉప్పలపాడు, చక్రాయపాలెం, జార్లపాలెం, 29న వెంపరాల, చిన్నకొత్తపల్లి, ధేనువుకొండ, 30న బొమ్మనంపాడు, గోవాడ, ధేనువుకొండ గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు జరుగుతాయని, ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఆమె కోరారు.

పంచారామాలకు అద్దంకి డిపో నుంచి బస్సులు

అద్దంకి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా అద్దంకి డిపో నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఇన్‌చార్జి డీఎం మహబూబి తెలిపారు. ఒక రోజులోనే పంచారామాలు అయిన సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతిలో ఉన్న శైవక్షేత్రాలను దర్శించుకునే విధంగా అద్దంకి డిపో నుంచి బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. కార్తీకమాసంలో అక్టోబరు 26, నవంబరు 2, 9, 16 తేదీలలో రాత్రి 9 గంటలకు అద్దంకి నుంచి సూపర్ లగ్జరీ బస్ బయలుదేరి సోమవారం పంచారామాలను దర్శించుకొని రాత్రికి వచ్చే విధంగా బస్‌లు నడుపుతున్నట్లు తెలిపారు. పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1100 టిక్కెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. 35 మంది భక్తులు గ్రూపుగా వస్తే ప్రత్యేక బస్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

బదనామ్..!



ఒక వైపు రోడ్డులోనే రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

నార్కెట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల రోడ్డు పనులు అసంపూర్తిగా..

పుష్కర కాలం నుంచి వాహనదారులకు అవస్థలు

అద్దంకి, సంతమాగులూరు మండలాల్లో భూసేకరణకు చెల్లించని పరిహారం

ప్రయాణికుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్న టోల్ ఫీజు

అద్దంకి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : నార్కెట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల(నామ్)రోడ్డును ప్రారంభించి పుష్కరకాలానికిపైగా గడిచింది. నేటికీ పలుచోట్ల అసంపూర్తిగా వదిలేసిన పనులతో ప్రయాణం ఇబ్బందిగా మారింది. అందుకు సంబంధించి రైతులకు నేటికీ పరిహారం చెల్లించలేదు. దీంతో వారూ అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తమిళనాడు, దక్షిణ కోస్తా జిల్లాల నుంచి హైదరాబాద్‌కు దగ్గర మార్గంగా ఉండేందుకు 2010లో నామ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. మొత్తం 212.5 కి.మీ దూరం ఉన్న ఈ రోడ్డు పనులు అత్యధిక శాతం 2014కు పూర్తి కావటంతో మూడు చోట్ల టోల్‌గేట్లు ఏర్పాటు చేశారు. పుష్కరకాలంగా టోల్‌గేట్ల వద్ద వాహనదారుల నుంచి ముక్కుపిండి టోల్‌ఫీజ్ వసూలు చేస్తున్నారు. పలుచోట్ల అసంపూర్తిగా ఉన్న పనులు మాత్రం పూర్తి చేయలేదు.



నామ్ రోడ్డు కుంగి ఏర్పడిన గాడులు

● 15 ఏళ్ల నుంచి భూసేకరణకు చెల్లించని పరిహారం

ప్రధానంగా బాపట్ల జిల్లా పరిధిలోని అద్దంకి మండలం గోపాలపురం, చక్రాయపాలెం, సంతమాగులూరు మండలం ఏల్చూరు వద్ద అసంపూర్తి పనులు పూర్తి చేయకుండా వదిలివేయటంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. గోపాలపురం వద్ద భూసేకరణకు సంబంధించి రైతులకు పరిహారం అందకపోవటంతో పనులను అప్పట్లో అడ్డుకున్నారు. సుమారు 15ఏళ్లుగా పరిహారం చెల్లింపు ప్రక్రియ పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో పనులు పూర్తికాకపోవడంతో అక్కడ రెండు రోడ్ల నుంచి వెళ్లాల్సిన వాహనాలు ఒకే రోడ్డులో ప్రయాణిస్తున్నాయి. అదే సమయంలో ఉన్న ఒక్క రోడ్డులో కూడా కుంగి గాడులు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

● ప్రభుత్వ మారినా ఆలస్యమే...

ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు పరిహారం చెల్లింపు ప్రక్రియ వేగవంతం అవుతుందని భావించినా ఆలస్యం అవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భూసేకరణకు సంబంధించి అప్పట్లోనే కొంత మొత్తాన్ని ఒంగోలు ఆర్‌డీవో ఖాతాలో జమ చేశారు. రైతులందరికీ చెల్లించాల్సిన మొత్తంకు సరిపడా లేదని సమాచారం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రైతులకు పరిహారం వెంటనే చెల్లించి నామ్ రోడ్డులో అసంపూర్తి పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, వాహనచోదకులు కోరుతున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

వ్యవసాయ కనెక్షన్ల మంజూరులో నిర్లక్ష్యం వద్దు

జిల్లా స్థాయి సమీక్షలో సీఎండీ పుల్లారెడ్డి



మాట్లాడుతున్న సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

చీరాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వ్యవసాయాధారిత కనెక్షన్ల ఏర్పాటులో నిర్లక్ష్యంగా ఉండరాదని సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి చెప్పారు. బుధవారం చీరాలలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిథిల దశకు చేరుతున్న ట్రాన్స్‌ఫార్మర్లను ముందస్తుగా గుర్తించాలన్నారు. 33 కేవీ, 11 కేవీలలో అంతరాయం శాతం తగ్గించాలని చెప్పారు. అలాగే సబ్సిడీ అందుబాటులో ఉన్న సోలార్ సౌకర్యంపై అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ, ప్రాజెక్టు డైరెక్టర్ కేవీఎస్ఎన్ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఇంజనీరింగ్ సూపరింటెండెంట్ ఆంజనేయులు, ఈఈ జాన్ థామస్, డీఈలు, ఏఈలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించండి

సీఎండీకు ఆమంచి వినతిపత్రం

వేటపాలెం(చీరాల), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా రైతులకు విద్యుత్ బిల్లుల సమస్యలకు పరిష్కారం చూపాలని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ కోరారు. బుధవారం సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డిని ఆమంచి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమం తప్పకుండా వేటపాలెం, చినగంజాం ఆక్వా రైతులు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. అయినా తాజాగా బ్యాక్ బిల్లులు చెల్లించాలని బిల్లులు అందినట్లు సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. అందుకు సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆమంచి వెంట భాస్కర్ రెడ్డి, తేళ్ల రామయ్య, గిరీ తదితరులు ఉన్నారు.

డీఎంజీకి గ్రానైట్ పరిశ్రమల యజమానుల వినతిపత్రం



డీఎంజీ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్, యజమానులు

మార్టూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : గనులు, భూగర్భశాఖ సంచాలకులు చంద్రశేఖర్‌కు బుధవారం మార్టూరు గ్రానైట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్ ఆధ్వర్యంలో యజమానులు వినతిపత్రం అందజేశారు. విజయవాడ నగర పరిధిలో ఉన్న ఇబ్రహీంపట్నంలో ఉన్న గనులు, భూగర్భశాఖ కార్యాలయంలో డీఎంజీగా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఇబ్బందులు పడుతున్న సమస్యలను చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్లారు. మైనింగ్ శ్లాబ్ సిస్టంలో సింగిల్ బ్లేడ్ మిషనుకు, మల్టీ కట్టర్‌కు గతంలో నిర్ణయించిన రేట్లనే శ్లాబ్ సిస్టంలో అనుమతించాలని కోరారు. అదనంగా కావాల్సిన ముడిరాయికి గతంలో క్యూబిక్ మీటరుకు చెల్లిస్తున్న రూ.2 వేల వెయ్యి రూపాయలకు తగ్గించాలని కోరారు. గ్రానైట్ పలకలను పరిశ్రమలు నుంచి కొనుగోలుదారులు కొని తీసుకువెళుతున్న సమయంలో అధికారులు తనిఖీ చేసే సమయంలో కొలతలలో 20 శాతం వ్యత్యాసాన్ని అనుమతించాలని కోరారు. ప్రతి నెలా రాయల్టీ చెల్లిస్తామని, ముడిరాయిని క్వారీల నుంచి తెచ్చుకొనేందుకు 90 రోజుల వరకు గడువును పొడిగించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల యజమానులు చల్లగుండ్ల కృష్ణ, ఇంటూరి ఆంజనేయులు, పచ్చకాయల సుబ్బరామయ్య, కొర్రపాటి వేణుగోపాల్ పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార శాఖ అధికారి బదిలీ

వేటపాలెం(చీరాల), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం వ్యవసాయ సహకార సంఘం అధికారి ఎల్ సుధాకరరావు అద్దంకి సహకార సంఘానికి బదిలీ అయ్యారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను ఉన్నతాధికారులు బుధవారం విడుదల చేశారు.

ఒకేషనల్ కోర్సులు విద్యార్థులకు ఉపయోగకరం



టెక్స్‌టైల్స్ ఫ్యాక్టరీని సందర్శిస్తున్న విద్యార్థులు

అద్దంకిటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టి ట్రైనర్స్ ద్వారా శిక్షణ ఇవ్వడం ఎంతో ఉపయోగమని హెచ్‌ఎం పి. గంగాధరరావు చెప్పారు. బుధవారం మండలంలోని తిమ్మయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా కుంకుపాడు గ్రామంలోని కల్లం టెక్స్‌టైల్స్‌ను సందర్శించారు. అక్కడ ఉత్పత్తి తయారీ విభాగం, ఫ్యాక్టరీకి అవసరమైన పవర్ సప్లయ్ సోలార్ ప్లాంట్ ద్వారా తీసుకోవడం వంటి విషయాలను ఎండీ శివారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో పీడీ మధుబాబు, పీఈటీ రవి, సీఆర్పీ రమేష్ పాల్గొన్నారు.

భారీ వర్షాలతో రోడ్లు జలమయం



భారీ వర్షంతో పర్చూరు కొట్లబజార్ పరిస్థితి ఇలా

పర్చూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో రోడ్లు జలమయం అయ్యాయి. ప్రధాన రోడ్లపై సైతం పెద్ద ఎత్తున నీరు నిలిచిపోవటంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. లోతట్టు కాలనీలు వర్షపు నీటితో ముంచెత్తాయి. మండలంలోని అనేక గ్రామాల్లో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో కొద్దిపాటి వర్షానికే కాలువలు పొంగిపొర్లి మురుగునీరు రోడ్లపై చేరటంతో తీవ్ర ఇబ్బందిగా మారింది. పర్చూరులోని కొట్లబజార్ వీధి మరింత దయనీయంగా మారింది. డ్రైనేజ్ కాలువలను సైతం ఆక్రమించుకొని కట్టడాలను నిర్మాణం చేసుకోవటంతో సమస్య తీవ్ర తరంగా మారింది. దీంతో వర్షం పడింది అంటే రాకపోకలు సాగించలేని పరిస్థితి ఉంది.

ధర్మవరం చెరువులో చేపల పెంపకానికి వేలం పూర్తి

అద్దంకిటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మవరం గ్రామంలో బుధవారం చిన్నచెరువులో చేపలు వేసి పెంచి పట్టుకొనే హక్కుకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. కనీస ధర రూ.7 లక్షలు నిర్ణయించగా కలవకూరుకు చెందిన తన్నీరు చిరంజీవి రూ.10లక్షలకు హెచ్చుపాట పాడి దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి. వరూధిని, సర్పంచ్ చావాల కళ్యాణి, ఇన్‌చార్జి ఉప ఎంపీడీవో ఎన్. మస్తాన్‌వలి, పంచాయతీ కార్యదర్శి పల్లా నాగేశ్వరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అవీఇవీ

కుటుంబసభ్యులు, బంధువుల రోదనలతో ముగిసిన అంత్యక్రియలు

విషాదంలో జనకవరం గ్రామం

ఒకే ఇంట మూడు మృతదేహాలతో కలచివేత



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

పంగులూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలతో జనకవరం గ్రామంలో తల్లి, బిడ్డల అంత్యక్రియలు బుధవారం ముగిశాయి. మంగళవారం రాత్రి తల్లి నాగలక్ష్మి, కుమార్తె అవంతిక, కుమారుడు భువనసాయి మృతదేహాలు గ్రామానికి చేరుకున్నాయి. భార్యతో గొడవపడి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిన భర్త కుంచాల రమేష్ కనిపించకుండా పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన భార్య నాగలక్ష్మి కన్నబిడ్డలను చంపి, తానూ ఆత్మహత్య చేసుకున్న తీరు కలచివేసింది. భార్యాభర్తల మధ్య తలెత్తిన మనస్పర్థలు ఇంత ఘోరానికి దారితీయడం ప్రజలను వేదనకు గురిచేసింది. ఒక్క ఇంటిముందు మూడు మార్చురీ బాక్సులలో మృతదేహాలను చూడటం చూపరులను కంటతడిపెట్టించింది. బంధుమిత్రులు, కుటుంబసభ్యుల మిన్నంటిన రోదనలతో బుధవారం వర్షంలోనే ముగ్గురి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.

మోటార్‌సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మరమ్మతులకు గురైన మోటార్‌సైకిల్‌ను మెకానిక్ షెడ్‌కు తీసుకు వస్తుండగా ప్రమాదానికి గురై గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు... బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు నుంచి మరమ్మతులకు గురైన మోటార్‌సైకిల్‌ను బుధవారం మరో మోటార్‌సైకిల్‌కు కట్టుకొని అద్దంకిలోని మెకానిక్ షెడ్‌కు తీసుకు వస్తుండగా శింగరకొండ రోడ్డులోప్రమాదం చోటుచేసుకుంది. ముందు వస్తున్న మోటార్ సైకిల్ సడన్ బ్రేక్ వేయటంతో వెనుక ఉన్న బైక్ ఢీ కొట్టింది. దీంతో వెనుక మోటార్‌సైకిల్ నడుపుతున్న బి.రాంబాబుకు గాయాలయ్యాయి. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కల్వర్టు దిమ్మె ఢీ.. గోతిలో పడిపోయిన లారీ



గోతిలో పడిపోయిన లారీ

మార్టూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై గుంటూరు వైపు మండల పరిధిలో రాజుపాలెం కూడలి సమీపంలో బుధవారం ఉదయం నిద్రమత్తులో లారీ డ్రైవరు రోడ్డు పక్కన కల్వర్టు దిమ్మెను ఢీకొట్టాడు. దీంతో లారీ రోడ్డు పక్కన గోతిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో లారీ పూర్తిగా దెబ్బతింది. ఒంగోలు నుంచి పొగాకు చెక్కుల లోడుతో పెదకాకాని వెళుతున్న లారీ ప్రమాదానికి గురయ్యింది. డ్రైవరు సుబ్బారావు క్షేమంగా బయటపడ్డారు.

రూ.50 పెట్రోల్ కోసం ఏఆర్ కానిస్టేబుల్ వీరంగం

బంక్ సిబ్బందిపై విచక్షణారహితంగా దాడి

సీసీ కెమెరాలో దృశ్యాలు

పోలీసులకు ఫిర్యాదు చేసిన నిర్వాహకులు



సిబ్బందిపై దాడికి పాల్పడుతున్న గోపీ(టోపీ పెట్టుకున్న వ్యక్తి)

వేటపాలెం(చీరాల), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రూ.50 పెట్రోల్ కోసం ఏఆర్ కానిస్టేబుల్ కీర్తి గోపీ వీరంగం సృష్టించాడు. బంకు నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం... వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని 216 జాతీయ రహదారిలో పెట్రోల్ బంకు ఉంది. బచ్చులవారిపాలేనికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గోపీ గతంలో దాదాపుగా రెండేళ్ల హైవే మొబైల్ వాహనానికి డ్రైవర్‌గా పనిచేసి ప్రస్తుతం ఎస్పీ కార్యాలయంలో ఎంటీ సెక్షన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇదిలా ఉండగా బుధవారం తెల్లవారుజామున అతను మరో ఇద్దరు వ్యక్తులతో పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి రూ.50 పెట్రోల్ అప్పుగా పోయాలని సిబ్బందిని అడిగాడు. వారు నిరాకరించారు. దీంతో గోపీ వీరంగం సృష్టించాడు. ఇరువురు సిబ్బందిపై దాడికి పాల్పడ్డాడు. నానా దుర్భాషలాడాడు. ఆ దృశ్యాలంతా సీసీ కెమెరాలో రికార్డు కాగా నిర్వాహకులు వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఘటనపై విచారణ జరుగుతోంది.

శింగరకొండలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

అద్దంకి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి) : శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బుధవారం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామి వార్లకు ఈ క్రతువు నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు స్వామి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. దేవాలయం ధర్మకర్తల మండలి ఛైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఒంగోలులో వేటపాలెం బాలుడు

● హోంకు తరలింపు

ఒంగోలు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దారి తప్పిన పదేళ్ళ బాలుడిని వేటపాలెం హోంకు తరలించారు. బుధవారం ఒంగోలులోని మంగమ్మ కాలేజీ ఎదురుగా రోడ్డు డివైడర్‌పై ఒంటిపై దుస్తులు కూడా లేకుండా పదేళ్ల బాలుడు కూర్చుని ఉన్నాడు. జోరుగా వర్షం పడటంతో చలికి వణుకుతూ ఉండగా అటువైపుగా వెళుతున్న లారీ డ్రైవర్ దండేల కోటేశ్వరరావు చూశాడు. వెంటనే బాలుడి వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. తనది వేటపాలెం అని, తండ్రి పేరు పొన్నం శామ్యూలు అని చెప్పాడు. దీంతో ఆయన పోలీసులకు సమాచారం ఇవ్వగా హెల్ప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్ సహకారంతో జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు బాలుడిని వేటపాలెం హోంకు ఒంగోలు తాలుకా సీఐ విజయకృష్ణ తరలించారు.